

జిల్లాలో ఎంపీ నిధుల వినియోగంలో అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై వల్లభనేని బాలశౌరి అసహనం వ్యక్తం చేశారు. నిధులను సక్రమంగా వినియోగించుకోకపోతే ఎలా ప్రశ్నించారు. యాదవ కల్యాణ మండపం నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి కాంట్రాక్టర్‌లను బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు. వివిధ శాఖల ద్వారా ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదికలు అందజేస్తే నిధులు తీసుకువచ్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని వివరించారు.

నిధుల వినియోగం సక్రమంగా లేకపోతే ఎలా?

అధికారులను ప్రశ్నించిన ఎంపీ బాలశౌరి

జిల్లాలో ఎంపీ నిధుల వినియోగంపై అసంతృప్తి

- యాదవ కల్యాణ మండపం నిర్మాణం తీరుపై ఆగ్రహం
- కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని సూచన
- మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి రూ.18.50 కోట్ల సీఎస్ఆర్ నిధులు
- కౌలు రైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు ప్రత్యేక పోర్టల్ అవసరం
- దిశా సమావేశంలో ఎంపీ వల్లభనేని బాలశౌరి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ప్రజోపయోగమైన పనులకు ఎంపీ నిధులు, సీఎస్ఆర్ నిధులను మంజూరు చేస్తే, ఆ నిధులను సక్రమంగా వినియోగించకపోతే ఎలాగని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ప్రశ్నించారు. జిల్లా పరిషత్ సమావేశపు హాలులో సోమవారం జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ(దిశా) సమావేశం ఎంపీ బాలశౌరి అధ్యక్షతన జరిగింది. వివిధ విభాగాల్లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధుల వినియోగం, అభివృద్ధి కార్యక్రమాలు అమలుపై చర్చించారు. మచిలీపట్నం గొడుగుపేటలో యాదవ కల్యాణ మండపం నిర్మాణానికి రూ.50 లక్షల సీఎస్ఆర్ నిధులను మంజూరు చేస్తే, పునాదుల దశలో కేవలం ఆరు పిల్లర్లు వేసి నిధులు మొత్తం ఖర్చయిపోయాయని, మరో రూ.50లక్షల నిధులు ఇవ్వాలని కాంట్రాక్టర్ చెబుతున్నారని, ఇది ఎంతవరకు సమంజసమన్నారు. ఈ అంశంపై విచారణ చేసి, సదరు కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని, ఇప్పటి వరకు వాస్తవంగా ఖర్చు చేసిన నగదు మినహా, మిగిలిన మొత్తాన్ని కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేయాలని కలెక్టర్ బాలాజీకి ఎంపీ సూచించారు.

వేరే ప్రాంతంలో భూసేకరణపై దృష్టి పెట్టాలి

జాతీయ రహదారి-65 విస్తరణలో భాగంగా మచిలీపట్నం సమీపంలోని ఎస్ఎన్‌గొల్లపాలెం వద్ద రైతుల నుంచి ఇప్పటికే రెండు విడతలుగా భూమిని తీసుకున్నారని ఎంపీ బాలశౌరి తెలిపారు. ఈ రహదారి విస్తరణ కోసం మూడో విడత రైతుల నుంచి భూమిని తీసుకుంటున్నారని, ఈ అంశంపై రైతులు గొడవ చేస్తున్నారని, జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి వేరే ప్రాంతంలో భూసేకరణపై జాతీయ రహదారుల అధికారులు దృష్టి సారించాలని సూచించారు. భూమి కోల్పోయే రైతులు మీ వద్దకు వస్తారని, వారు చెప్పిన అంశాలను జాతీయరహదారుల విభాగం అధికారులు పరిగణనలోకి తీసకుని వారికి తగు న్యాయం చేయాలన్నారు. కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం వద్ద జాతీయ రహదారి విస్తరణలో బాగంగా తాగు నీటి పైప్‌లైన్ దెబ్బతిందని, దీంతో ఆ గ్రామానికి తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఎంపీ సూచించారు. పెడన వద్ద రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణంలోనూ తీవ్ర ఆలస్యం జరుగుతోందని, త్వరితగతిన ఈ పనిని పూర్తి చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి, పక్కన కలెక్టర్ బాలాజీ, జేసీ నవీన్, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు

సర్వజన ఆస్పత్రిలో రెండు విభాగాల ఏర్పాటుకు రూ.18.50 కోట్లు

మచిలీపట్నం మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో యాంజియోగ్రామ్ సేవలు అందుబాటులో లేవని, ఇక్కడ క్యాతల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు బెల్ కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.6.50 కోట్లు మంజూరు చేయిస్తానని ఎంపీ బాలశౌరి తెలిపారు. దీంతో పాటు కేన్సర్ చికిత్స కోసం రేడియాలజీ విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు ఓఎన్‌జీసీ నుంచి సీఎస్ఆర్ నిధులు రూ.12కోట్లను తీసుకువస్తానని భరోసా ఇచ్చారు. గుడివాడ ఏరియా ఆస్పత్రిలో సీటీ స్కానర్‌ను ఏర్పాటు చేసేందుకు రూ.1.80 కోట్ల ఎంపీ నిధులను మిగతా 6లో..

మీ త్యాగం మరువను!

నిలువనీడలేని రోజున కూర్చునేందుకు చోటిచ్చారు


రాజధాని కోసం భూములిచ్చిన రైతులు, మహిళలతో సీఎం చంద్రబాబు

- ఒక్క మాటతో వేల ఎకరాల భూమినిచ్చారు
- రాజధాని నిర్మాణానికి దారి చూపారు.
- స్థల బలం, ఆడబిడ్డల పోరాటంతోనే నేటి అమరావతి
- సీడ్, కోర్ క్యాపిటల్‌లతో సింగపూర్ అద్భుతమైన ప్లాన్
- అమరావతి నుంచి నేరుగా ఏడు రాష్ట్రాలకు రోడ్లు
- గ్రీన్ ఎనర్జీతో కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దుతాం
- అట్టహాసంగా ప్రారంభమైన సీఆర్డీఏ కార్యాలయం

రాజధాని రైతులు, మహిళలతో సీఎం చంద్రబాబు భావోద్వేగ ప్రసంగం

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): 'రాజధాని రైతులు, ఆడబిడ్డలను మర్చిపోను. రాష్ట్ర విభజన జరిగి రాజధాని లేక, నిలువనీడ కూడా లేని సమయంలో కూర్చునేందుకు చోటు కల్పించి, భూములిచ్చిన మిమ్మల్ని మరిచిపోవడమంటే.. మీ త్యాగాలను మర్చిపోవడమే! ఒక్క పిలుపుతో వేల ఎకరాల భూములిచ్చారు. రాజధాని నిర్మాణానికి దారిచూపారు. రాజధానిని కాపాడుకోవడానికి ఆడబిడ్డలు ఉద్యమించారు. రాజధానిని నిలుపుకోవడం కోసం మీ ఆరాటం, చేసిన పోరాటం, పడిన అవమానాలు, పడ్డ ఇబ్బందులు ఏవీ నేను మర్చిపోలేను. అందుకే రాజధాని రైతులకు రెట్టింపు గౌరవం కల్పిస్తా. వారికి అండగా నిలుస్తా' అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. రాజధాని అమరావతిలోని రాయపూడి గ్రామంలో ఏపీ సీఆర్డీఏ కార్యాలయం సోమవారం ఉదయం సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అట్టహాసంగా ప్రారంభమైంది. కార్యాలయంలోని సీఆర్డీఏ, సీడీఎంఏ, ఏడీసీఎల్, మినిస్టర్ చాంబర్లను ప్రారంభించారు. ఏడంతస్తులు తిరిగి కార్యాలయంలోని ఏర్పాట్లను పరిశీలించారు. గ్రౌండ్ ఫ్లోర్లో ఏర్పాటు చేసిన ధ్యాన బుద్ధ లోహ విగ్రహాన్ని, రిసెప్షన్, మిగతా 6లో..

ప్రధాని సభకు 250 బస్సులు

ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి వెళ్లనున్న ఆర్టీసీ సర్వీసులు

- నేటి సాయంత్రం నుంచి 17వ తేదీ వరకు కర్నూలులోనే..
- ఈ 3 రోజులు ప్రత్యామ్నాయం చూసుకోవాలని ప్రజలకు ఆర్టీసీ అధికారుల విజ్ఞప్తి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కర్నూలులో ఈ నెల 16వ తేదీన జరిగే ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన, బహిరంగ సభను పురస్కరించుకుని రికార్డు స్థాయిలో 3,200 ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకున్నారు. దీంతో ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 250 సర్వీసులు కర్నూలు తరలివెళుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా నుంచి 150 బస్సులు, కృష్ణాజిల్లా నుంచి 100 బస్సులు కర్నూలుకు బయలుదేరాయి. మంగళవారం సాయంత్రానికే ఆర్టీసీ బస్సులను కర్నూలులో రిపోర్టు చేయాల్సిందిగా అధికారులు నిర్దేశించారు. కర్నూలులో రిపోర్టు చేసిన తర్వాత అక్కడ అధికారులు ఇచ్చే ఆదేశాలను బట్టి బస్సులను 15వ తేదీన ప్రజలను తీసుకురావాల్సిన ప్రాంతాలకు పంపిస్తారు. 16వ తేదీన సభ ఉంటుంది. సభకు వచ్చిన జనాలను మళ్లీ అదే రోజున గమ్యస్థానాలకు తీసుకువెళ్లాల్సి ఉంటుంది. తిరిగి 17వతేదీ ఉదయం ఈ బస్సులన్నీ ఉమ్మడి కృష్ణాజిల్లాకు బయలుదేరతాయి. అదే రోజు సాయంత్రాని కల్లా ఈ బస్సులు ఆయా డిపోలకు వచ్చే అవకాశం ఉంది. ఈ కారణంగా ఈ నెల 14వ తేదీ నుంచి 17వ తేదీ సాయంత్రం వరకు ఉమ్మడి జిల్లాలో 250 ఆర్టీసీ బస్సులు ఉండవు. అందువల్ల ఈ మూడు రోజులు ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మాజీ మంత్రి జోగి రమేశ్ మెడకు నకిలీ మద్యం ఉచ్చు బిగుస్తోంది. అద్దేపల్లి జనార్దనరావు విడుదల చేసిన వీడియో వైసీపీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి నకిలీ మద్యం తయారు చేశారు. అనేక మంది ఈ మద్యం తాగి ప్రాణాలు కోల్పోయారు. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఆది నుంచి జోగి రమేశ్ అనేక వివాదాల్లో ఉన్నారు. నాడు చంద్రబాబు ఇంటిపైన దాడికి యత్నించారు. అగ్రిగోల్డ్ భూముల కబ్జాలోనూ ఉన్నారు.

జోగి మెడకు నకిలీ మద్యం ఉచ్చు!



రమేశ్ పేరు ప్రస్తావిస్తూ వీడియో విడుదల చేసిన జనార్దనరావు

- వైసీపీ హయాంలో నకిలీ మద్యానికి అనేక కుటుంబాలు బలి
- ఆది నుంచి అనేక వివాదాల్లో జోగి రమేశ్
- నాడు చంద్రబాబు ఇంటిపైన దాడికి యత్నం
- అగ్రిగోల్డ్ భూముల కబ్జా కేసులోనూ ఆరోపణలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): నకిలీ మద్యం తయారీ మూలాల వెనుక మాజీ మంత్రి జోగి రమేశ్ ఉన్నాడని జనార్దనరావు బాంబు పేల్చటంతో జోగి చుట్టూ మరో వివాదం ముసురుకుంది. ఇప్పటికే చంద్రబాబు ఇంటిపై దాడికి యత్నం, అగ్రిగోల్డ్ భూముల కబ్జా కేసుల్లో ఉన్నారు. తాజాగా నకిలీ మద్యం తయారీ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించినట్టు తెలుస్తోంది. ప్రభుత్వం నకిలీ మద్యంపై సిట్‌ను కూడా ఏర్పాటు చేయటంతో సమగ్ర విచారణ జరిపి నిందితులకు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచే అవకాశం ఉంది. అవసరమైతే అరెస్టులు కూడా చేసి కస్టడీ కోరనుంది. సిట్ విచారణతో కల్తీ మద్యం గుట్టు తేలే అవకాశం ఉంది. జనార్దనరావు వైసీపీ హయాంలో తాను కల్తీ మద్యం చేసినట్టుగా చెప్పటంతో కల్తీ మద్యం ఎక్కడ పుట్టిందన్నది అర్థమవుతోంది. అప్పట్లో కల్తీ మద్యం ఎవరెవరి సహకారంతో చేశారన్నది సిట్ విచారించనుంది. జనార్దనరావు జోగి రమేశ్ పేరును ప్రధానంగా ప్రస్తావించటంతో పాటు ఆయన ఆధ్వర్యంలోనే తాను నకిలీ మద్యాన్ని తయారు చేసినట్టు అంగీకరించటంతో.. జోగి పాత్రపై సమగ్ర విచారణ జరిగే అవకాశం కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భయపడి నకిలీ మద్యం తయారీని తాను మానుకున్నానని, జోగి రమేశ్ తనకు ఫోన్ చేసి నకిలీ మద్యం తయారీకి పురికొల్పారని, టీడీపీ ప్రభుత్వాన్ని భ్రష్టుపట్టించటానికి తనతో నకిలీ మద్యం తయారు చేయించారని, ఇబ్రహీంపట్నంలోనే తాను తయారు చేయాలనుకున్నా.. ప్రభుత్వంపై బురద చల్లటానికి తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని ఎంచుకున్నానని టీడీపీ మిగతా 6లో..

చిన్నప్పుడు ఒక బజారులోనే ఉండేవారు

జోగి రమేశ్, జనార్దనరావు ఇద్దరిదీ ఇబ్రహీంపట్నం కావటం గమనార్హం. రింగ్ సెంటర్ దగ్గర జోగి రమేశ్ ఉన్నపుడు జనార్దనరావు తాత ఇల్లు కూడా ఉండేది. జోగికి, జనార్దనరావుకు పరిచయమే లేదన్నది హాస్యాస్పదంగానే ఉంది. అద్దేపల్లి జనార్దనరావు వీడియో విడుదల చేసిన కొద్ది గంటలకే జోగి రమేశ్ తన నివాసంలో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశాడు. ఈ ప్రెస్‌మీట్‌లో అద్దేపల్లి జనార్దనరావుతో తనకు పరిచయమే లేదని బొంకారు. నకిలీ మద్యం కేసులు పట్టుబడక ముందు జనార్దనరావు జోగి రమేశ్‌ను కలవటానికి వచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై మీడియా మిత్రులు అడిగిన ప్రశ్నకు జోగి రమేశ్ వచ్చాడేమో ? బయటున్నాడేమో అంటూ వ్యాఖ్యానించారు. మా తాత, వాళ్ల తాత ఒకే బజారులో ఉండేవారంటూ చెప్పుకొచ్చారు.

సీబీఐ ఎంక్వయిరీ డిమాండ్ చేయటంలో ఆంతర్యం ఏమిటి ?

మాజీ మంత్రి జోగి రమేశ్ గత మూడు రోజులుగా ఏదో ఒక సందర్భంలో సీబీఐ ఎంక్వయిరీని డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం రాత్రి మైలవరంలో సిట్ విచారణలు కాదని, సీబీఐ ఎంక్వయిరీలు చేయించాలని డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం మైలవరంలో ఎక్సైజ్ కార్యాలయంలో మహిళలతో కలిసి వినతిపత్రం ఇచ్చిన సందర్భంలో కూడా జోగి సిట్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. మీ సిట్‌లు వల్ల ఉపయోగం లేదని సీబీఐ ఎంక్వయిరీ కోరారు. సిట్ వేస్తారని ముందుగానే జోగికి ఎలా లీకైందన్నది ప్రశ్నార్థకంగా ఉంది.

కృష్ణాలోనూ నకిలీ మరక

ఈలచెట్ల దిబ్బలో నకిలీ మద్యం సీసాల గుర్తింపు

- ఆరు నెలల క్రితం జరిగిన ఘటన
- గోప్యంగా ఉంచిన వ్యవహారం
- అవనిగడ్డకు చెందిన వ్యాపారే సూత్రధారి
- రిమాండ్ రిపోర్ట్‌లో వ్యాపారి పేరు



(ఆంధ్రజ్యోతి - విజయవాడ): రాష్ట్రంలో సంచలనం కలిగించిన నకిలీ మద్యం మరకలు కృష్ణా జిల్లాలో కనిపించాయా? అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన మద్యం వ్యాపారికి ఈ మరకలు అంటుకున్నాయా? కొన్ని నెలల క్రితం బయటపడిన నకిలీ మద్యం సీసాలు భూమిలో సమాధి అయిపోయాయా? అంటే అవుననే జవాబులు విశ్వసనీయవర్గాల నుంచి వస్తున్నాయి. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలోని ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ కేంద్రం వ్యవహారం వెలుగులోకి వచ్చిన కొద్దిరోజులకే ఇబ్రహీంపట్నంలోని అద్దేపల్లి జనార్దనరావు ఆధ్వర్యంలో జరుగుతన్న నకిలీ మద్యం తయారీ బయటపడింది. ఈ కేసులో రోజుకో కొత్త కోణం బయటపడుతూనే ఉంది. ఇప్పటి వరకు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం వరకు పరిమితమైన ఈ నకిలీ వ్యవహారం అవనిగడ్డ నియోజకవర్గంలో ఆరు నెలల క్రితమే తేలినట్టు తెలుస్తోంది. నాగాయకలంక మండలంలోని ఈలచెట్లదిబ్బ గ్రామంలో ఆరు నెలల క్రితం నకిలీ మద్యం సీసాలను గుర్తించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. అవనిగడ్డలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతలతో అంటకాగి, ఇప్పుడు కూటమి గోడలకు జారబడిన మద్యం వ్యాపారి పేరు ఈ క్రమంలో వినిపిస్తోంది. తాజాగా అద్దేపల్లి జనార్దనరావును కోర్టులో హాజరుపరిచినప్పుడు ఎక్సైజ్ పోలీసులు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో ఆ మద్యం వ్యాపారి మిగతా 6లో..

అవినీతి జలగల దొంగాట!



ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలోని కొందరు అవినీతి అధికారులు దొంగాట మొదలుపెట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో యథేచ్ఛగా చేసిన తప్పులను కూటమి ప్రభుత్వంలో సరిచేసుకునేందుకు కొత్త ప్లాన్ వేశారు. రీ ఎంక్వయిరీ వేయించుకొని క్లీన్ చిట్ పొందేందుకు ఈఎన్‌సీ కార్యాలయంలోని ఓ ఉన్నతాధికారితో బిగ్ డీల్ కుదుర్చుకున్నారు. అందుకు అనుగుణంగా పావులు కదుపుతున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల తీరుపై విమర్శలు

- గత వైసీపీ ప్రభుత్వంలో యథేచ్ఛగా అక్రమాలు
- కూటమి ప్రభుత్వంలో తప్పులను సరిచేసుకునే ప్లాన్!
- రీ ఎంక్వయిరీ వేయించుకొని.. క్లీన్ చిట్ పొందేందుకు యత్నం
- ఈఎన్‌సీ కార్యాలయంలోని ఓ ఉన్నతాధికారితో బిగ్ డీల్!
- అందుకు అనుగుణంగా కదులుతున్న పావులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): నాడు చేసిన తప్పులను కూటమి ప్రభుత్వంలో కడిగేసుకునేందుకు గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగంలోని కొందరు అవినీతి అధికారులు ఈఎన్‌సీ కార్యాలయంలో తిష్టవేసి పైరవీలు ప్రారంభించారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖలో భారీ స్థాయిలో అవినీతి, అక్రమాలు జరిగాయి. ఈ అవినీతి భాగోతాలు పత్రికలకెక్కినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. లోకాయుక్తకు ఫిర్యాదులు అంది ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కానీ, అప్పట్లో పంచాయితీరాజ్ అధికారులు చర్యలు చేపట్టలేదు. లోకాయుక్త ఆదేశాలతో విచారణ జరపగా.. అధికారుల అవినీతి బాగోతాలు ఆధారాలతో సహా బయట పడ్డాయి. ఒక డీఈఈ, పలువురు ఏఈలపై అప్పట్లో ఆరోపణలు నిగ్గుతేలాయి. దీంతో మిగతా 6లో..

జీఎస్టీ సంస్కరణలతో ఊరట

- మంత్రి కొల్లు రవీంద్ర

స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తి వ్యాప్తి చెందాలి

8లో

చిన్న నీటిపారుదల పునరుద్ధరణకు రూ.7.50కోట్లు

6లో



వివిధ విభాగాల అధికారులతో మాట్లాడుతున్న ఈవో శీనానాయక్

వినూత్నంగా ఆలోచించండి

» ప్రతి భక్తుడు అమ్మవారిని సంతృప్తికరంగా దర్శనం చేసుకోవాలి : ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : భక్తుల సౌకర్యాల నిమిత్తం ప్రతి ఉద్యోగి వినూత్నంగా ఆలోచించి, ముందడుగు వేయాలని, రానున్న కార్తీకమాసం, భవాని దీక్షలు సందర్భంగా ప్రతి భక్తుడు దుర్గా మల్లేశ్వరుల దర్శనం సంతృప్తిగా చేసుకొని వెళ్లేలా ప్రణాళిక అమలు చేయాలని ఈవో వీకే శీనానాయక్ కోరారు. సోమవారం మహామండపం 4వ అంతస్తులోని కార్యాలయంలో వైదిక కమిటీ, ఇంజనీరింగ్, వివిధ విభాగాల అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, దసరాలో దేవస్థానం సిబ్బంది శ్రద్ధ, పనితీరు, సహనం ప్రతీఒక్కరూ గమనించారని, మరింత బాధ్యత దేవస్థానం యంత్రాంగంపై పెరిగిందన్నారు. భక్తుల నమ్మకం పోకుండా అందరూ తగిన చర్యలు తీసుకోవాలని, ఎక్కడ అలక్ష్యం జరిగినా సహించేది లేదని పేర్కొన్నారు. ధర్మకర్తల మండలి, దేవస్థానం యంత్రాంగం ఒకే దారిలో నడుస్తూ సమన్వయంతో వ్యవహరిద్దామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ పనులు, భవానీ దీక్షల విరమణ, గోల్డ్ అండ్ సిల్వర్ అప్రైజర్ క్యాబిన్, హుండీల ఏర్పాటు, ఆశీర్వచనం ప్రాంతం, టెంకాయ, శారీ కౌంటర్లు, వీఐపీ లాంజ్, టికెట్ల కౌంటర్లు (కనకదుర్గానగర్), కనకదుర్గానగర్ కాటేజ్‌లు, శ్రీచక్ర నవావరణార్చన, సీసీ కెమెరాలు ఏర్పాటు, తదితర 66 అంశాలపై చర్చించారు. ఆయా విభాగాలకు సంబంధించి మార్గదర్శకాలను జారీ చేశారు.

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆలయ పరిపాలనా సౌలభ్యం కోసం దుర్గామల్లేశ్వర దేవస్థానంలో పనిచేసే సహాయ కార్యనిర్వహణాధికారులు (ఏఈఓలు), ఈఈలు, పర్యవేక్షకుల (సూపరింటెండెంట్‌లు) అంతర్గత బదిలీ జరిగాయి. ఈ మేరకు ఈవో వీకే శీనానాయక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రంగారావుకు సీవీరెడ్డి ఛారిటీలు, భూమి సంబంధిత అంశాలు, ఆర్టీఐ, ప్రజా పిర్యాదుల విభాగం అప్పగించారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్



విశ్వనాథన్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ సోమవారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకస్వాములు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, వేద మంత్రోచ్చరణలతో అంతరాలయానికి తోడ్కొని వెళ్లారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం ఆయనకు ముఖ్య అర్చకులు ఆర్.శ్రీనివాసశాస్త్రి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



కళాశాలకు ప్రింటర్, జిరాక్స్ మిషన్‌లు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

శారదా గోపాలరత్న ఫౌండేషన్ సేవలు అభినందనీయం

» కళాశాలకు ప్రింటర్, జెరాక్స్ మిషన్ల వితరణ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : శారదా గోపాలరత్న ఫౌండేషన్ లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ప్రతిభ గల 18 మంది విద్యార్థులకు యేటా ప్రోత్సాహక నగదు బహుమతులు అందిస్తున్నారని, ఈ విద్యాసంవత్సరంలో రూ.20వేల విలువ గల జిరాక్స్ మిషన్ ఇవ్వడం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ప్రిన్సిపాల్ పి.లక్ష్మి అన్నారు. ఫౌండేషన్ ట్రస్టీ ఎ.అనసూయ ఆధ్వర్యంలో సోమవారం కళాశాలకు రూ.20వేల విలువ గల ప్రింటర్, జిరాక్స్ మిషన్లను అందజేశారు. ట్రస్టు సభ్యులు మూర్తి, శర్మ, కళాశాల లెక్చరర్లు హరనాథబాబు, సురేష్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

అవినీతి జలగల దొంగాట!


(5వ పేజీ తరువాయి)

అప్పటి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కూడా నిర్దేశించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వైసీపీ హయాంలో తప్పులు చేసిన వారిపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటారని అంతా భావించారు. ఇక తమ పని అయిపోయిందని అవినీతి అధికారులంతా భయపడ్డారు. తమకు కలిసి వచ్చే సమయం కోసం ఎదురుచూశారు. ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో ఒక ఉన్నతాధికారితో డీల్ పెట్టుకున్నారని తెలిసింది. బేరసారాలు అన్నీ కుదుర్చుకున్నారని సమాచారం. దొడ్డిదారిన రీ ఎంక్వయిరీ చేయించి తప్పులు నిర్ధారణ కాలేదన్నట్టుగా ఉన్నతస్థాయిలో నివేదిక పంపి అందరికీ క్లీన్‌చిట్ ఇచ్చేందుకు రహస్య ఒప్పందం కుదిరినట్టు తెలిసింది. ఈ డీల్ కోసం భారీ ఎత్తున నగదు సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారానికి సంబంధించి చాపకింద నీరులా అన్నీ జరిగిపోతున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి నివేదిక పంపి అందరికీ క్లీన్‌చిట్ ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్న దశలో ఇవన్నీ వెలుగులోకి వచ్చాయి.

అప్పట్లో జరిగిన అక్రమాల్లో కొన్ని..

విజయవాడ రూరల్ మండలం రాయనపాడు, పైడూరుపాడు గ్రామాల్లో రక్షిత మంచినీటి పనులకు సంబంధించి అవినీతి జరిగింది. జీఐ పైపులు సిమెంట్ రోడ్డు మీద వేయగా.. భూమి తవ్వి లోపల వేసినట్టుగా రికార్డు జరిగింది. ఏఈ అడ్డగోలుగా రికార్డు చేయగా.. ఇన్‌చార్జి డీఈఈ చెక్‌మెజర్‌మెంట్ చేశారు. ఇన్‌చార్జి ఈఈ పేమెంట్‌కు క్లియర్ చేశారు. చందర్లపాడు మండలంలో రక్షిత మంచినీటి పైపులైన్లకు సంబంధించి 63 ఎంఎం డయా పైపులు వేశారు. కానీ 75 ఎంఎం డయా పైపులు వేసినట్టుగా రికార్డు చేశారు. పైపులు వేసిన నిర్ణీత దూరం కంటే కూడా ఎక్కువగా వేసినట్టు రికార్డు చేశారు. కంచికచర్లలో హెచ్‌డీపీఈ పైపులు కాకుండా డూప్లికేట్ పైపులు వేయటంతో.. అవి ప్రెజర్ టెస్ట్‌లో పగిలిపోయాయి. ఇలా చెప్పటానికి అనేక అక్రమాలు ఉన్నాయి. ఈ అక్రమాలకు సంబంధించి అప్పటి ఇన్‌చార్జి ఈఈ రింగ్ మాస్టర్‌గా వ్యవహరించారని ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాలపై లోకాయుక్తకు ఫిర్యాదు అందిన తర్వాత క్వాలిటీ కంట్రోల్ విభాగం నేతృత్వంలో తనిఖీలు నిర్వహించగా, అక్రమాలు నిజమని తేలింది. వీటిపై అప్పటి ఈఎన్‌సీ కార్యాలయంలోని చీఫ్ ఇంజనీర్ సంజీవ్ రెడ్డి పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. ఆ తర్వాత అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నవారిపై చార్జ్‌షీట్లు ఇవ్వటం జరిగింది.

వ్యవసాయ ఉత్పత్తులు చేతికి వచ్చే తరుణంలో మార్కెట్లో ధర పడిపోవటం ఆనవాయితీగా మారింది. ఆరుగాలం రేయినక, పగలనక శ్రమటోడ్చి పండించే రైతులకు వ్యాపారుల మాయాజాలం వల్ల గిట్టుబాటు ధర లభించటమన్నది ఎండమావిగా తయారైంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న కనీస మద్దతు ధరలు కూడా రైతులను ఆదుకోవటం లేదు. సకాలంలో పంటను కొని అన్నదాతకు మద్దతుగా నిలబడాల్సిన పాలకులు ఆ దిశగా చర్యలు తీసుకోవటం లేదు. ఏవో సాకులు చూపిస్తూ, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించటంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తూ కాలయాపన చేస్తున్నారు. అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి అన్నట్టుగా తయారుకావటంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో తమ దుస్థితిని తలుచుకుని రైతులు మానసికంగా కుమిలిపోతున్నారు.





మాయాబజార్!

» కందులు, పెసలు, మొక్కజొన్నలకు గిట్టుబాటుధరేదీ?

» అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి.. నిస్సహాయ స్థితిలో రైతులు

వ్యాపారుల మాయాజాలం.. ధరలు ఢమాల్!

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల)

కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో గత ఖరీఫ్‌లో రైతులు సుమారు రెండువేల ఎకరాల్లో కంది పంట సాగు చేశారు. సగటున నాలుగు క్వింటాళ్ల వంతున ఫిబ్రవరి మొదటి పక్షంలోపు పంట చేతికి వచ్చింది. అప్పట్లో బయటి మార్కెట్లో క్వింటా కందుల ధర రూ.6100లు మాత్రమే. మద్దతు ధర రూ. 7,550లు. పాలకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినప్పటికీ స్పందన లేదు. మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పుణ్యమా అంటూ రంగంలోకి దిగిన మార్క్‌ఫెడ్ అధికారులు కేవలం 45 టన్నులు మాత్రమే కొన్నారు. ఈక్రాప్‌లో కంది పంట విస్తీర్ణం చాలా తక్కువగా నమోదైంది అంటూ కుంటి సాకులు చెప్పారు. సాధారణంగా కంది పంట సాలుకు సాలుకు వంద అంగుళాలకు పైగా ఎడం ఉంటుంది. ఎక్కువ స్థలం ఖాళీగా ఉంచకుండా రైతులు కందిలో అంతర పంటగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. వ్యవసాయాధికారులు మాత్రం ఎకరంలో 20శాతం కంది పంట, 80 శాతం మొక్కజొన్నగా ఈ క్రాప్‌లో నమోదు చేశారు. రైతులు గత్యంతరం లేక కందులను ఏదో ఒక ధరకు తెగనమ్ముతున్నారు. గత నెలలో క్వింటా రూ.5,800 అమ్మారు. ప్రస్తుతం రెండు రోజుల నుంచి రూ. 6350 వరకు పలుకుతోంది.

10వేల ఎకరాల్లో పెసర, మినుము సాగు..

కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పదివేల ఎకరాల్లో రైతులు పెసర, మినుము పంట సాగుచేశారు. భారీ వర్షాలకు మినుము పంట ఎక్కువ భాగం దెబ్బతిన్నది. పెసర మాత్రం ఎకరానికి రెండు నుంచి నాలుగు క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. గత నెల మొదటి వారంలో పంట పూర్తిగా చేతికి అందింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ. 8,768లు. బయటి మార్కెట్లో వ్యాపారులు రూ.6000కి కూడా కొనటం లేదు. పెసలు కొనుగోలు చేయాల్సిందిగా రైతులు వేడుకుంటున్నప్పటికీ స్పందన శూన్యం. మద్దతు ధర వస్తుందన్న ఆశతో శీతల గిడ్డంగుల్లో, మార్కెట్ యార్డుల్లో, ఇళ్లల్లో రైతులు పెసల బస్తాలు నిల్వ చేశారు. రైతులు స్థానిక యార్డు చుట్టూ తిరుగుతున్నారు. గత మూడేళ్లుగా మార్క్‌ఫెడ్ పెసలను కొనకపోవడంతో రైతులు నిల్వ చేస్తూనే ఉన్నారు. గతేడాది కొంటామంటూ రైతులను సీఎం యాప్‌లో పేర్లు నమోదు చేసుకోమన్నారు. రైతుల ఫోన్లకు మేసేజ్‌లు కూడా పంపారు. కాని కిలో కూడా కొన్న దాఖలా లేదు.

పదివేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు..

కంచికచర్ల, వీరులపాడు, నందిగామ, చందర్లపాడు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పదివేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగుచేశారు. ప్రస్తుతం కోతలు జరుగుతున్నాయి. ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నది. పంట కోసిన తర్వాత మొక్కజొన్న రెండు మూడు రోజులు ఆరాల్సి ఉంది. వారం రోజుల నుంచి తెరపి లేకుండా వర్షాలు పడుతుండటంతో మొదట్లో కోసిన పంట ఆరుదల కోసం రైతులు పడిన ఇబ్బందులు వర్ణనాతీతం. మద్దతు ధర రూ.24 వందలు కాగా, బయటి మార్కెట్లో రూ.19 వందల నుంచి రూ.1950లోపు కొంటున్నారు. క్వింటాకు నాలుగు వందలకు పైగా రైతులకు నష్టం జరుగుతున్నది. పంట కోసిన రైతులు దాదాపుగా వ్యాపారులకు అమ్మేశారు. వర్షం వల్ల ప్రస్తుతం కోతలు జరగటం లేదు.



కందులు కొనుగోలు చేయాలని వేడుకుంటున్న రైతులు

రైతులకు న్యాయం చేయండి

ఏది ఏమైనా ప్రకటనలు కాదు.. క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి. పంటల సాగునుంచి అమ్మకాల వరకు బాధలు, కష్టాలు, నష్టాలు గురించి క్షుణంగా తెలుసుకున్నప్పుడు రైతులకు న్యాయం జరుగుతుంది. ప్రస్తుతం బాధిత రైతులందరూ ప్రభుత్వ మద్దతు కోసం వేయికళ్లతో ఎంతో ఆశగా నిరీక్షిస్తున్నారు. పాలకులు తక్షణం స్పందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, హాజరైన అధికారులు

చిన్న నీటిపారుదల పునరుద్ధరణకు రూ.7.50కోట్లు

మచిలీపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆరు చిన్ననీటివనరుల పథకాలను పునరుద్ధరించేందుకు జిల్లాస్థాయి అమలు పర్యవేక్షణ కమిటీ తీర్మానం చేసింది. జిల్లాపరిషత్ సీఈవో చాంబరులో సోమవారం కలెక్టర్ బాలాజీ అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జలవనరులను పునరుద్ధరించి సాగుకు అవసరమైన నీటిని అందించడానికి ఆర్ఆర్ఆర్ పేరుతో ప్రయోగాత్మక పథకానికి కేంద్రప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో నీటిసంఘాల ప్రతినిధులతో చర్చించి జలవనరుల పథకాలను పునరుద్ధరించాలని నిర్ణయించామన్నారు. గన్నవరం మండలం వెదురుపావులూరు, పురుషోత్తపట్నం, వీరపనేనిగూడెం, చిక్కవరం, బాపులపాడుమండలం కొయ్యూరు. వీరవల్లి గ్రామాల్లోని చెరువులను పునరుద్ధరించేందుకు రూ.7.50కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు తయారుచేసి కేంద్రప్రభుత్వానికి పంపనున్నట్టు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జలవనరులశాఖ ఎస్ఈ ఆర్.మోహనరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.సోమశేఖర్, డ్వామా పీడీ ఎన్‌వీ శివప్రసాద్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

22నుంచి బ్యూటీషియన్ కోర్సుపై శిక్షణ

ఉంగుటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, ఆత్కూరు, స్వర్ణభారత్‌ట్రస్ట్ ప్రాంగణం(విజయవాడ చాప్టర్)లోని యూనియన్ బ్యాంక్ స్వశక్తి గ్రామీణ స్వయంఉపాధి శిక్షణాకేంద్రం(యూబీఆర్ఎస్ఈటీఐ)లో ఈనెల 22నుంచి మహిళలకు జూనియర్ బ్యూటీ ప్రాక్టీషనర్/బ్యూటీ పార్లర్ బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్టు శిక్షణాకేంద్రం డైరెక్టర్ వి.అమరేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఉమ్మడి కృష్ణాజిల్లాల్లోని గ్రామీణప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి సంస్థ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా పలు వృత్తినైపుణ్యకోర్సుల్లో శిక్షణ అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పొందేందుకు 10వ తరగతి చదివి, 19నుంచి 45 మధ్య వయసుగల ఉమ్మడి కృష్ణాజిల్లాల్లోని గ్రామీణప్రాంత యువతులు అర్హులని తెలిపారు. 35రోజుల కోర్సులో శిక్షణ పొందేందుకు ఆసక్తిగల నిరుద్యోగ మహిళలు ఈనెల 20లోగా తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డ్, రేషన్‌కార్డు, నాలుగు పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలతో నేరుగా కార్యాలయానికి విచ్చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు6304254730(రామకృష్ణ),9490011081(శ్రీహరి), 7416169916 (గోపి)ఫోన్‌నెంబర్లలో సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.

జోగి మెడకు నకిలీ ఉచ్చు!

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యే జయచంద్రారెడ్డికి సంబంధం లేదని జోగి రమేశ్ తనను నమ్మించి మోసం చెయ్యటంతోనే తాను నిజం చెబుతున్నానని వీడియో విడుదల చేయటంతో జనార్దనరావు, జోగి రమేశ్‌ల బంధం ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది.

అంతా జోగే నని అద్దేపల్లి అంటుంటే.. బట్టలూడదీస్తామంటూ జోగి రంకెలు

ఒకవైపు జనార్దనరావు కథ - స్క్రీన్‌ప్లే - డైరెక్షన్ అంతా జోగి రమేశ్ అని చెబుతుంటే ఆయన మాత్రం ప్రెస్‌మీట్‌లో అంతా చంద్రబాబు అని ఆరోపించారు. రిమాండ్ రిపోర్టులో తన పేరు లేదని జోగి వాదించారు. దర్యాప్తులో భాగంగా తదుపరి రిమాండ్ రిపోర్టులో జోగిని చేర్చటానికి అవకాశం ఉంటుంది. ఈ విషయం తెలిసి కూడా జోగి రిమాండ్ రిపోర్టులో తన పేరు లేదంటూ చెప్పుకొచ్చారు. కృష్ణాజిల్లా తన అడ్డా.. గడ్డ అంటూ పేర్కొంటూ తాను రాజశేఖరరెడ్డి అనుచరుడినని, క్షణికానందం కోసం నన్ను అరెస్టు చేయించవచ్చేమో కానీ తర్వాత మీ బట్టలూడదీస్తాం అంటూ రంకెలు వేశారు. రెడ్‌బుక్‌ను ఫైర్ చేస్తానంటూ అరిచారు.

అద్దేపల్లిని జోగి అడ్డంగా ఇరికించాడా?

రాజకీయ ప్రయోజనాల కోసం అద్దేపల్లిని మాజీ మంత్రి జోగి పావుగా వాడుకున్నాడా అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. జనార్దనరావు నకిలీ మద్యం తయారు చేసిన వ్యవహారం వెలుగులోకి వచ్చాక కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. టీడీపీ ఎమ్మెల్యే జయచంద్రారెడ్డితో పాటు మరికొందరిని సస్పెండ్ చేసింది. దీంతో పాటు బాధ్యులైన వారిని ఎవ్వరినీ వదలవద్దని ఆదేశించటంతో .. అద్దేపల్లి తాను కేసులో ఇరుక్కుపోయానని భావించి లొంగిపోయాడా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే విషయాన్ని జనార్దనరావు కూడా తన వీడియోలో ప్రస్తావించాడు. తనను దక్షిణాఫ్రికా పంపించింది కూడా జోగి రమేశ్ అని, తనను బెయిల్ మీద బయటకు తీసుకువస్తానని చెప్పి పట్టించుకోలేదని చెప్పటంతో జోగి రమేశ్, అద్దేపల్లి జనార్దనరావును పావుగా ఉపయోగించుకున్నాడా అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి.

మీ త్యాగం మరువను!

(5వ పేజీ తరువాయి)

క్యాంటీన్‌లను పరిశీలించారు. ఫస్ట్ ఫ్లోర్లోని కాన్ఫరెన్స్ హాళ్లను పరిశీలించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని ల్యాండ్ పూలింగ్ కాన్సెప్టును తీసుకువచ్చి ఒక్క పిలుపు ఇస్తే వేల ఎకరాలు ఇచ్చి, రాజధాని నిర్మాణానికి ముందుకు వచ్చిన రైతుల త్యాగాలను ఆయన కొనియాడారు. ప్రజాధనాన్ని ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా నిర్మిస్తున్న సెల్ఫ్ మానిటైజేషన్ నగరమని, విమర్శకులు ఆ విషయం గుర్తించాలని హితవు పలికారు. సీడ్ క్యాపిటల్, దాని చుట్టూ కోర్ క్యాపిటల్, ఆ తరువాత సీఆర్డీఏ రీజియన్‌లతో సింగపూర్ అద్భుతమైన మాస్టర్ ప్లాన్ ఇచ్చిందని, దానితో రైతుల భవిష్యత్తు రాబోయే రోజుల్లో అద్భుతంగా మారుతుందని చెప్పారు. రైతులు అందివచ్చిన అవకాశాన్ని వదులుకోవద్దని, వారి భూములను అమ్ముకోవద్దని విజ్ఞప్తి చేశారు. హైటెక్ సిటీ రాక ముందు ఎకరా లక్ష రూపాయలు ఉన్న భూములు ఇప్పుడు ఎకరా 170 కోట్లు ఉందని చెప్పారు. దీనిని బట్టి భవిష్యత్ నగరం ఎలా ఉండబోతోందో ఆలోచించుకోవాలన్నారు. రాజధాని గ్రీన్ ఎనర్జీతో కూడిన కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దబోతున్నామన్నారు. ఒక వైపు కృష్ణమ్మ, మరోవైపు పచ్చని చెట్లతో అద్భుత నగరంగా అమరావతి ఉండబోతోందన్నారు. రాజధానిలో అద్భుతమైన రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. రాజధానిలోని ఏడు రోడ్లు నేరుగా ఇతర రాష్ట్రాలకు వెళతాయన్నారు. డ్రెయిన్లు, వాటర్ లైన్లు, విద్యుత్ లైన్లు అన్నీ ప్రత్యేకించి యుటిలిటీ డక్టుల్లో నిర్మిస్తున్నామని చెప్పారు. తద్వారా రేపటి అమరావతి అద్భుత నగరంగా మారబోతోందని చెప్పారు.

అమరావతికి స్థల బలం..

దేవతల రాజధాని అమరావతి అయితే.. మన ప్రజా రాజధాని అమరావతి అని సీఎం కొనియాడారు. దేశంలోని దేవాలయాల నుంచి మట్టి, పవిత్ర జాలలు తెచ్చి దేవుడి ఆశీస్సులతో ప్రారంభమైన నగరమని అన్నారు. సాక్షాత్తూ ప్రధాని పార్లమెంటులోని మట్టి, యమునా నదీ జలాలు తెచ్చి అమరావతికి తోడ్పాటునిచ్చారన్నారు. ఇప్పుడు కూడా రాజధానికి ప్రధాని ఎంతో తోడ్పాటునిస్తున్నారన్నారు. రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేసే బాధ్యత తనదేనని, అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆ బాధ్యతతోనే పవన్ కల్యాణ్, బీజేపీతో కలిసి పనిచేస్తున్నామన్నారు. 2047 వరకూ ఇదే ఒరవడి కొనసాగితే అమరావతికి అద్భుతమైన భవిష్యత్తు ఉంటుందన్నారు. అప్పటి వరకూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

త్యాగాల ఫలితాలు రైతులే అనుభవించాలి

రాజధాని కోసం రోడ్డెక్కి పోరాడిన అమరావతి మహిళా రైతుల త్యాగం మరవలేనిదన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేసి, వారు పడ్డ అవమానాలు, బాధలు అన్నీ గుర్తేనన్నారు. అందుకే తాను కూడా జోలె పట్టి వారికి అండగా నిలిచామన్నారు. కష్టాలు మరిచిపోవద్దని, రైతులు చేసిన త్యాగాల ఫలితాలను రైతులే అనుభవించాలన్నారు. కార్యక్రమంలో కొలికపూడి శ్రీనివాసరావు, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నిధుల వినియోగం సక్రమంగాలేకపోతే ఎలా?

(5వ పేజీ తరువాయి)

రెండేళ్ల క్రితమే మంజూరు చేసినా అక్కడ సీటీ స్కానర్‌ను ఏర్పాటు చేయలేదని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ సీటీ స్కానర్ ఏర్పాటుకు రూ.3.40 కోట్లు అవుతుందని, దీంతో ఈ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. తాను కేటాయించిన నగదును నూతనంగా నిర్మాణం చేసిన పెదపారుపూడి పీహెచ్‌సీలో అయినా వినియోగించాలని ఎంపీ కలెక్టర్‌కు సూచించారు. జిల్లాలోని పీహెచ్‌సీలలో అవసరమైన పరికరాలకు సంబంధించిన పూర్తిస్థాయి నివేదికను తనకు ఇస్తే నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు.

దాళ్వా పంటకు నీరిస్తారా.. కాల్వలు బాగుచేస్తారా!

ప్రకాశం బ్యారేజీ నుంచి నీటిని భారీగా సముద్రంలోకి వదిలేస్తున్నారని, జిల్లాలో సముద్రతీర ప్రాంత మండలాల్లో ఈ ఏడాది రబీ సీజన్‌లో దాళ్వా పంటకు సాగు నీరు ఇస్తారా, పంట కాల్వలను బాగుచేస్తారా అని ఎంపీ బాలశౌరి జలవనరులశాఖ అధికారులను ప్రశ్నించారు. జిల్లాలో కాల్వల నిర్వహణ పనులకు ఎంతమేర నిధులు విడుదల చేశారు. పంట కాల్వలు, డ్రెయిన్‌లలో మురుగునీటి పారుదలకు ఆటంకం లేకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారని ఆయన అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాల్వల నిర్వహణ పనులకు రూ.15కోట్ల నిధులను విడుదల చేశారని, వీటితో పనులు జరుగుతున్నాయని కలెక్టర్, అధికారులు తెలిపారు. ప్రకాశం బ్యారేజీ దిగువన చోడవరం వద్ద, మోపిదేవి మండలం బండికోళ్లలంక వద్ద రెండు బ్యారేజీలను నిర్మాణం చేయాల్సి ఉందని, ఈ బ్యారేజీ నిర్మాణం జరిగితే ఇక్కడ నీటిని నిల్వ ఉంచి జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీటిని జిల్లాలోని గ్రామాలకు అందించేందుకు అవకాశం ఉంటుందని ఎంపీ అన్నారు. ఈ బ్యారేజీలకు సంబంధించిన తుది డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టులను త్వరితగతిన తయారు చేయాలని ఎంపీ అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో ఈ బ్యారేజీల నిర్మాణం విషయంపై తాను మాట్లాడుతానని వివరించారు.

కౌలు రైతులకు పంట రుణాలు ఇప్పించండి

కౌలు రైతులకు పంట రుణాలు ఇప్పించడానికి ప్రత్యేక పోర్టల్‌ను తయారు చేయాలని, ఈ అంశంపై కలెక్టర్ చొరవ చూపాలని, బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించి విధివిధానాలు ఖరారు చేయాలని ఎంపీ బాలశౌరి కలెక్టర్ బాలాజీకి సూచించారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

సుప్రీం సీజేపై దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ధర్నా

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి, విహెచ్‌పిఎస్ నాయకులు కలెక్టరేట్ వద్ద నిరసన, ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణాజిల్లా ఇన్‌చార్జి, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు జలదంకి నరసింగరావు మాదిగ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి యత్నాన్ని నిరసిస్తూ కృష్ణాజిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన నిర్వహించడం జరిగిందన్నారు. చీఫ్ జస్టిస్‌పై దాడి అనాగరికమైంది, ఈ దాడి ప్రజాస్వామిక స్ఫూర్తి, రాజ్యాంగం మీద జరిగిన దాడిగానే ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడి దళిత పీడిత వర్గాల ప్రజలను తీవ్ర మనోవేదనకు గురిచేసిందని, దేశ ప్రజలందరూ దీనిని ఖండించారన్నారు. ధర్నా అనంతరం జిల్లా డీఆర్వోకి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి కృష్ణాజిల్లా ఇన్‌చార్జి సిద్దెల జయరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు పసుమర్తి దినేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు చిట్టూరి అర్జునరావు మాదిగ, గన్నవరం నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద వేణు మాదిగ, మచిలీపట్నం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మట్టా గోపాలకృష్ణ, అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్షుడు కొడాలి ఏలియా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణాలోనూ నకిలీ మరక

(5వ పేజీ తరువాయి)

పేరు ఉండడం గమనార్హం.

లంకలను టార్గెట్ చేసుకున్నారా?

అవనిగడ్డ నియోజకవర్గంలో లంక గ్రామాలు ఎక్కువగా ఉంటాయి. ఇక్కడ మత్స్యకార జనాభా అధికం నివసిస్తుంటారు. వారిని టార్గెట్ చేసుకుని నకిలీ మద్యం సరుకును చలామణి చేసినట్టు తెలుస్తోంది. ఈలచెట్లదిబ్బలో కొన్ని నెలల క్రితం ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేసినప్పుడు ఈ నకిలీ మద్యం సీసాలను గుర్తించినట్టు నియోజకవర్గంలో ప్రచారం నడుస్తోంది. వాటిని గుర్తించిన ఎక్సైజ్ పోలీసులు ఏ జిల్లాకు చెందిన వారన్నది సందేహంగా మారింది. ఈ గ్రామం రేపల్లెకు సమీపంగా ఉంటుంది. అక్కడి నుంచి ఎక్సైజ్ పోలీసులు వచ్చి ఈ నకిలీ మద్యం సీసాలను గుర్తించినట్టు తెలుస్తోంది. ఇప్పటి వరకు వెలుగులోకి రాకుండా ఉన్న ఈ విషయం ఇబ్రహీంపట్నం వ్యవహారంతో తెరపైకి వచ్చింది. రేపల్లె ఎక్సైజ్ పోలీసులు వస్తే ఆ సమాచారాన్ని కృష్ణా జిల్లా ఎక్సైజ్ అధికారులకు ఎందుకు ఇవ్వలేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. మొత్తం మీద నకిలీ మద్యం తయారీ విషయం ఎక్సైజ్ శాఖను కుదిపేస్తోంది. అవనిగడ్డ నియోజకవర్గంలో కూటమి నేతలతో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్న ఆ మద్యం వ్యాపారి పేరును జనార్దనరావు పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. ఇదే విషయాన్ని పోలీసులు రిమాండ్ రిపోర్టులో స్పష్టం చేశారు. జనార్దనరావుతో కలిసి హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ7 బార్‌లో అవనిగడ్డకు చెందిన మద్యం వ్యాపారి ఒక భాగస్వామిగా ఉన్నాడు. జనార్దనరావు ఈ బృందాన్ని తీసుకుని గోవాకు వెళ్లినప్పుడు అందులోనూ ఉన్నాడు. అసలు నకిలీ మద్యం తయారీకి ఫార్ములాను రూపొందించిన బాలాజీతో జరిగిన చర్చల్లో పాల్గొన్నాడు. తాను వైసీపీ అధికారంలో ఉన్నప్పటి నుంచి నకిలీ మద్యం తయారు చేస్తున్నట్టు జనార్దనరావు అంగీకరించాడు. ఈ పరిస్థితుల్లో అవనిగడ్డకు చెందిన మద్యం వ్యాపారిపై ఇప్పుడు అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మద్యం అక్రమాలపై కఠిన చర్యలు : ఎస్పీ

మచిలీపట్నం టౌన్ : జిల్లాలో మద్యం దుకాణాలు, బార్లను ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలు, స్క్వాడ్‌లు తనిఖీలు నిర్వహిస్తున్నారని, అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సూపరింటెండెంట్ గంగాధరరావు అన్నారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. జిల్లాలో బెల్టు షాపులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2025 జనవరి 1 నుంచి ఇప్పటి వరకు 434 బెల్టు షాపులపై కేసులు బనాయించి 434 మందిని అరెస్టు చేసి 881 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. 332 పాత నేరస్తులపై బైండోవర్ కేసులు బనాయించామన్నారు.

గూగుల్‌తో ఒప్పందం విప్లవాత్మకం: వర్ల

అమరావతి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యువతకు 20 లక్షల ఉద్యోగాలను సృష్టించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గూగుల్ అనుబంధ సంస్థ రైడన్‌తో మంగళవారం చేసుకోనున్న ఒప్పందం విప్లవాత్మకమైనదన్నారు. దక్షిణాసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ క్లస్టర్‌ను విశాఖలో నిర్మించడానికి ఇది శ్రీకారమని అన్నారు. ఈ ఒప్పందం రాష్ట్రాభివృద్ధికి గొప్ప ఊతమిస్తుందని తెలిపారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

సీపీఆర్‌పై అవగాహన



గన్నవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : హార్ట్ ఎటాక్ వచ్చిన వారికి ప్రాథమిక చికిత్స సీపీఆర్ ద్వారా తమ విలువైన ప్రాణాలను కాపాడు కోవచ్చని సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీదేవి అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నుంచి 17వ తేదీ వరకూ సీపీఆర్ అవగాహన వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గుండెపోటు వచ్చిన వారికి సీపీఆర్ ఎలా చేయాలో డాక్టర్ సల్మా వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ, అవగాహన సదస్సు సీపీఆర్ చేసి గుండెపోటు వచ్చిన కొంత మందిని కాపాడుకోవచ్చన్నారు. డాక్టర్ రేచల్, సృజన, నిర్మల పాల్గొన్నారు.

చెత్త, వ్యర్థాలకు హైవే!

- టీటీడీ కల్యాణ మండపం సమీపాన కిలోమీటరు మేర చెత్త కుప్పలు
- వ్యర్థాలు కుళ్లి వెదజల్లుతున్న దుర్గంధం
- ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు





విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిలో వ్యర్థాలు, తగులబెట్టిన చెత్త

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి, సర్వీసురోడ్డు చెత్తకుప్పలతో డంపింగ్‌యార్డులా తయారవడంతో రోడ్లపై వెళ్లేవారితో పాటు స్థాని కులకు అసౌకర్యం కలుగుతుంది. హైవేలో టీటీడీ కల్యాణ మండపం సమీపాన కిలోమీటరు మేర చెత్త కుప్పలతో పాటు కాల్చిన చెత్త, కాటూరు రోడ్డు అండర్‌పాస్ సమీపాన గండిగుంట వైపు వెళ్లే సర్వీసురోడ్డు పొడవునా చెతకుప్పలు పేరుకుపోతూ వర్షాలకు కుళ్లి దుర్వాసన రావడంతో రోడ్డుపైన ముక్కుమూసుకుని వెళ్లవలసి వస్తుంది. హైవేపైన, సర్వీసురోడ్డులో ఉయ్యూరు, గండిగుంట నుంచి ట్రాక్టర్లు, వ్యాన్‌లు, ఆటో ట్రాలీల్లో చెత్త, వ్యర్థాలు, కుళ్లిన పండ్లు, కొబ్బరి బొండాల టెంకలు చికెన్‌షాపుల వ్యర్థాలు తీసుకువచ్చి పోస్తున్నారు. దీంతో గాలికిలేచి రోడ్డంతా పడుతుంది. పేరుకుపోయిన చెత్తకు పారిశుధ్య కార్మికులు నిప్పు పెడుతున్నారు. దీంతో పొగతో పాటు కాలుతున్న వ్యర్థాల నుంచి భరించలేని దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్డుపైన వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. ఉయ్యూరులో దుకాణాల నుంచి వచ్చిన చెత్త, కుళ్లిన పండ్లు, ఇతర వ్యర్థాలు, చికెన్‌షాపుల్లో వచ్చే వ్యర్థా పగలు, రాత్రులు ఎప్పుడిపడితే అప్పుడు తీసుకువచ్చి పోస్తున్నా పట్టించుకున్నవారులేరు. చెత్త కుప్పలు పేరుకు పోతుంటే నిప్పుపెట్టడంతో దుర్గంధంతో పాటు కాలిన మసి గాలికి లేచి దిచక్రవాహనాలపై వెళ్లే వారిపైన పడుతుంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అవార్డు అందుకుంటున్న నారాయణరావు

నారాయణరావుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

కానూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఈసీఈ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పాలెపు నారాయణరావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు- 2025ను అందుకున్నారు. నగరంలోని సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్ర మంలో ఏఐ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ చీఫ్ కోఆర్డినేటర్, సీఈవో డాక్టర్ బుద్ద చంద్రశేఖర్, సొసైటీ అధ్యక్షుడు ప్రసాద్ నారాయణరావుకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఫ్యాకల్టీ సభ్యులు నారాయణరావును అభినందించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బండారు గూడెంలో పేకాట స్థావరంపై వీరవల్లి పోలీసులు సోమవారం దాడి చేశారు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బండారుగూడెంలోని పాల కేంద్రం వద్ద పేకాట నిర్వహిస్తుండగా దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 4,330తో పాటు 5 సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా పేకాట లాంటి చట్ట వ్యతిరేక కార్యక్ర మాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీనివాస్ హెచ్చరించారు.

దేశ అభ్యున్నతే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సనాతన ధర్మ వైశిష్ట్యాన్ని తెలియజేస్తూ రాజ్యాంగ విలువ లతో కూడిన దేశ అభ్యున్నతే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని గన్నవరం ఖండ్ కార్యనిర్వాహక్ వేణుగోపాల్ అన్నారు. వీరవల్లి పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో సోమవారం ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుక నిర్వహించారు. దేశ ప్రాచీన సంస్కృతి ఆధారంగా ఐక్యతాభావనతో సేవలందించాలన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ధర్మజాగరణ ప్రముఖ్ ఎదురువాడ శ్రీనివాసరావు, వడ్లమూడి రాంజీ, రామసేతు కార్యకర్త యడవల్లి పాండు రంగారావు, శివశక్తి సభ్యులు వెంకటేశ్వరరావు, మోర్ల ఆంజనేయులు, జలసూత్రం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్, సభ్యత్వాలు అందజేస్తున్న నాయకులు

విలువలతో కూడిన విద్యనందించాలి

గన్నవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించినప్పుడే ఉన్నత గౌరవం లభిస్తుందని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో సోమవారం కొత్తగా చేరిన ఉపాధ్యాయులకు ఆయా హెచ్‌ఎంలు సర్వీస్ రిజిస్టర్ అందజేయగా యూటీఎఫ్ సభ్యత్వాలను నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. సేవా పుస్తకాలను అందజేశారు. యూటీఎఫ్ నాయకులు జీవి రవిబాబు, తాతా శ్రీనివాసరావు, డి.కుమార్, బాలసుబ్బమ్మ, సుజయశ్రీ, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రాంగణంలో వర్షపు నీరు

- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

ఉయ్యూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వర్షపు నీరు నిలిచి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాల ఆవరణలో భవనాలకు నడుమ, అసెంబ్లీ నిర్వహించే చోట పల్లంగా ఉండటంతో చిన్నపాటి వర్షానికి సైతం నీరు పోయే మార్గం లేక నిలిచిపోతుంది. భవనాల మధ్య నీరు నిలవడంతో తరగతి గదులకు వెళ్లేందుకు విద్యార్థులు నీటిలో నుండి వెళుతూ ఇబ్బందిపడుతున్నారు. అసెంబ్లీ జరిగే చోట కూడా నీరు నిల్వడంతో అసెంబ్లీ నిర్వహించే వీలు లేకుండా పోతుంది. ప్రాంగణం పల్లం కావడం, వర్షపు నీరుపోయేమార్గం లేకపోవ డంవల్ల చిన్నపాటి వర్షం కురిసినా నిలిచి పోవడంతో విద్యార్థు లకు ఇబ్బంది కలుగుతుంది.





పీఏసీఎస్, నీటి సంఘం అధ్యక్షులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పార్టీ ప్రతిష్టను పెంచేలా వ్యవహరించాలి

పీఏసీఎస్, నీటి సంఘం అధ్యక్షులతో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మిమ్మల్ని గుర్తించి పదవులు కట్టబెట్టిన పార్టీ ప్రతిష్ట పెంచేలా వ్యవహరించాలని పీఏసీఎస్, నీటి సంఘం అధ్యక్షులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సూచించారు. సోమవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో పీఏసీ ఎస్, నీటిసంఘం అధ్యక్షులతో జరిపిన జరిగిన సమీక్ష సమావేశం లో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీకి మచ్చ తెచ్చే విధంగా కాకుండా మంచి పేరు తెచ్చే విధంగా పనిచేయాలని కోరారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమవుతున్న క్రమంలో రైతు సమస్యలను తెలుసుకొని సకాలంలో పరిష్కరించేలా చూడాలన్నారు. పార్టీ, ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. కార్యక్ర మంలో టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న లయన్స్ ఇంటర్నేషనల్ 316 డీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆంజనేయులు

విద్యార్థులు ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి

లయన్స్ ఇంటర్నేషనల్ 316 డీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆంజనేయులు

కానూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరగాలని, విద్యార్థులకు శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని లయన్స్ ఇంటర్నేషనల్ 316 డీ డిస్ట్రిక్ట్ గవర్నర్ వీవీవీఎస్ ఆంజనేయులు అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారో త్సవాల్లో భాగంగా చివర రోజైన ఆదివారం రాత్రి కానూరులోని నారాయణ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రత్యేక అతిథి ఏపీ స్టేట్ అకడమిక్ డైరెక్టర్ బ్రహ్మజీ మాట్లాడుతూ, విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెరగాలని, ఇలాంటి కార్యక్రమాలు యువతలో ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుతాయన్నారు. జిల్లా పూర్వ గవర్నర్ అన్నపరెడ్డి కోటిరెడ్డి ప్రసంగిస్తూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని సాధించాలని కోరారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్ బావిశెట్టి మాట్లాడుతూ, లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా తొమ్మిది రోజులపాటు ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు నిర్వహించగా ప్రజల నుంచి అనూహ్యస్పందన వచ్చిందని తెలిపారు. సైకాలజిస్ట్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్ బావిశెట్టి రచించిన ఏ హోలిస్టిక్ గైడ్ టూ మెంటల్ వెల్‌బీయింగ్ అనే పుస్తకాన్ని ఆంజనేయులుతోపాటు అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ శ్రీనివాస రెడ్డి, చక్రధర్, ఎం. ప్రసాద్, శైలజ, చందన్, రవికుమార్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై అవగాహన



ఉయ్యూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు కలుగుతుందని ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్‌కుమార్ అన్నారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహనలో భాగంగా సోమవారం ఎంపీడీవో శేషగిరి రావుతో కలసి కడవకొల్లులో బైక్ ర్యాలీ నిర్వహించారు. చాలా వస్తువులపై ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ శాతం తగ్గించడం వల్ల ప్రజలకు కలిగే మెలు తెలియజేస్తూ గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహిం చారు. సచివాలయ ఉద్యోగులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి



రామవరప్పాడు జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో ఉపాధ్యాయులు

గుణదల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను పతిఒక్కరూ గౌరవించాలని రామవరప్పాడు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం తాయారు అన్నారు. జాతీయ బాలికా దినోత్సవ వేడుక రామవరప్పాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ, సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు వారి హక్కులను గురించి చర్చ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ప్రాధాన్యతనిస్తూ అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి మాట్లాడుతూ, మునగ ఆకు, రాగిజావ, బెల్లం, చిక్కీలు, జామకాయ వంటివి ఆహారంగా తీసుకుంటే మంచిదని వివరించారు. టాటా ట్రస్ట్ నుంచి కిన్నెర, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



చైర్మన్ రాధాకృష్ణను సత్కరిస్తున్న బీసీ నేతలు

దుర్గగుడి చైర్మన్‌కు బీసీ నేతల అభినందన

పెనమలూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి చైర్మన్‌గా ఎంపికయిన బొర్రా రాధాకృష్ణ(గాంధీ)ను పెనమలూరు నియోజకవర్గ బీసీ నేతలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం రాధాకృష్ణ ఇంటి వద్ద ఆయన్ను బీసీ సెల్ నాయకులు సంగెపు రంగారావు, శొంఠి శివరాం ఆధ్వర్యంలో నేతలు కలిసి సత్కరించారు. రాధాకృష్ణను కలిసిన వారిలో వణుకూరు విక్రం, చిట్టూరి నాగేశ్వరరావు, బొర్రా వెంకట్, వీరంకి కుటుంబరావు, సిరిగిరి మధు, ఆకునూరు సుబ్బారావు, ఇంటూరి మురళి, మునిపోయిన బాబు, వణుకూరు మారుతి సురేష్, కొడెల సురేష్, జన్ను నాగరాజు తదితరులు ఉన్నారు.



కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకులు విస్తృత సేవలందించాలి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గన్నవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకు సేవలను విస్తృతంగా అందించాలని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు అన్నారు. స్థానిక బాలాజీ రెస్టారెంట్ ఎదురుగా ది కనకమహాలక్ష్మీ కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ తమ 36వ శాఖను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ మాట్లాడుతూ, రాజధాని ప్రాంతంలో చిన్న, మధ్య తరహా, ఉన్నత స్థాయి ప్రజలకు సహకారాన్ని అందించేందుకు బ్యాంకు తమ వంతు విధులను నిర్వర్తించాలన్నారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు అన్నారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ప్రముఖ వ్యాపారవేత్త బొప్పుడి లీలా చక్రధర్, బ్యాంకు ముఖ్య కార్యని ర్వాహణాధికారి కె.శ్యాం కిషోర్, బ్యాంకు మేనేజర్ సీహెచ్ రత్తయ్య పాల్గొన్నారు.



నూకల వెంకట సాంబశివరావును సత్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

వ్యాపారవేత్త సాంబశివరావుకు సత్కారం

ఉయ్యూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బర్లింగ్టన్ స్టేట్ విశ్వవిద్యాలయం నుంచి వ్యాపార, సామాజిక సేవాకార్యక్రమాలకు సంబధించి డాక్టరేట్ అందుకున్న సుధీర్ టింబర్‌డిపో అధినేత నూకల వెంకట సాంబశివరావును సోమవారం ఘనంగా సత్కరించారు. మూడు దశాబ్దాలుగా వాణిజ్య, వ్యాపార, సామాజిక సేవా కార్యక్రమాల్లో నిర్విరామంగా పాల్గొంటున్న సాంబశివరావు సేవలకు గుర్తింపుగా బర్లింగ్టన్ స్టేట్ విశ్వవిద్యాలయం ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఇండియా ఇంటర్నేషనల్ డాక్టరేట్ ప్రధానోత్సవ కార్యక్ర మంలో గౌరవ డాక్టరేట్‌తో పాటు అవార్డుతో సత్కరించింది. ఈ సందర్భంగా ఏజీ అండ్ ఎస్‌జీ ఎస్ కళాశాల వాకర్స్ అసోసియే షన్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాంబశివరావును ఆయన నివాసంలో కలసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు



కేసరపల్లి చిల్లీస్ వైన్‌షాపులో బీర్‌లను పరిశీలిస్తున్న ఎక్సైజ్ సీఐ సురేఖ

కేసరపల్లిలో కల్తీ మద్యం లేదు

ఎక్సైజ్ సీఐ సురేఖ

గన్నవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కేసరపల్లిలో కల్తీ మద్యం లేదని ఎక్సైజ్ సీఐ సురేఖ స్పష్టం చేశారు. కేసరపల్లి చిల్లీస్ వైన్‌షాపును ఎక్సైజ్ సీఐ సురేఖ సోమవారం పరిశీలించారు. ఇదే షాపులో కల్తీ బీర్‌లు ఇచ్చారని పలువురు హడావుడి చేసిన నేపథ్యంలో అలాంటిది ఏమీ లేదన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆదివారం మధ్యాహ్నం ఖర్జూర స్ట్రాంగ్ బీర్‌లను ఇద్దరు వ్యక్తులు మూడు కొనుగోలు చేశారని, సాయంత్రం ఓపెన్ చేసిన బీర్ బాటిల్‌ను తీసుకువచ్చి దీనిలో నుంచి గ్యాస్ రావటం లేదని ఇది కల్తీ మద్యం అని మద్యం షాపు సిబ్బందితో వాగ్వివాదానికి దిగారని, ఆ వీడియోను సోషల్ మీడియాలో వాళ్లే ప్రచారం చేసినట్లు సీఐ తెలిపారు. షాపును పరిశీ లించగా కల్తీ మద్యం కాని, కాలం గడిచిన మద్యం గాని లేదని చెప్పారు. ఖర్జూర స్ట్రాంగ్ బీర్ 650 ఎంఎల్-20 కేసులు స్టాక్ రూములో, 80సీసాలు ఫ్రిజ్‌లో ఉన్నాయన్నారు. ప్రతి బాటిల్‌ను తనిఖీ చేసిన ఎటువంటి కల్తీ మద్యం ఆనవాళ్లు లేవన్నారు. ఇలాంటి అసత్య ప్రచారాలు నమ్మవద్దని తెలిపారు. సీసీ కెమెరాలను పరిశీలించి వ్యక్తులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

డాక్టర్ రమేష్‌కు లైఫ్‌టైం అచీవ్‌మెంట్

విజయవాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆస్టర్ రమేష్ ఆసుపత్రిలో ప్రముఖ కార్డియాలజిస్ట్‌గా సేవలందిస్తున్న డాక్టర్ పోతినేని రమేష్‌బాబు 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ ఇన్ రీజినల్ కార్డియాలజీ అండ్ హెల్త్‌కేర్ లీడర్‌షిప్ అవార్డు' అందుకున్నట్టు ఆసుపత్రి మేనేజ్‌మెంట్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ అవార్డును వాయిస్ ఆఫ్ హెల్త్‌కేర్ (వీవోహెచ్) సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన బీట్-2025 నేషనల్ కార్డియోవాస్కులర్ సమ్మిట్ అండ్ అవార్డ్స్‌లో ప్రదానం చేసినట్టు తెలిపింది. డాక్టర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఆస్టర్ రమేష్ ఆసుపత్రి కార్డియాలజీ రంగంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా సంస్థగా ఎదిగిందని ఆసుపత్రి మేనేజ్‌మెంట్ వెల్లడించింది. ఆసుపత్రిలో ఆధునిక గుండె చికిత్సలు, నివారణ, ప్రజా అవగాహన సదస్సులను విజయవంతంగా నిర్వహిస్తోందని తెలిపింది.



కొత్త టీచర్లకు సూచనలు ఇస్తున్న బందరు ఎంఈవో ప్రసాద్

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది: డీఈవో

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని డీఈవో పీవీజే రామారావు అన్నారు. సోమవారం జిల్లాలో వివిధ మండలాల్లో నూతనంగా మెగా డీఎస్సీ ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. 471 మందికి 422 మంది తమకు కేటాయించిన పాఠశాలల్లో చేరారు. ఈ సందర్భంగా డీఈవో రామారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు నూతన బోధనా పద్ధతులపై పాఠశాల పనితీరుపై శిక్షణా తరగతులు నిర్వహించామన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ బోధనాభ్యసన ప్రక్రియ చేపట్టాలని హితవు పలికారు. బందరు డీవైఈవో సింగ్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అవనిగడ్డ మండలంలో 8, బంటుమిల్లిలో 35, చల్లపల్లిలో 10, ఘంటసాలలో 13, గూడూరులో 8, కృత్తివెన్నులో 82, కోడూరులో 24, మోపిదేవిలో 14, మొవ్వలో 19, నాగాయలంకలో 23, పెడనలో 14 మంది టీచర్లు విధుల్లో చేరారన్నారు. బందరు మండలంలో ఎంఈవో దుర్గాప్రసాద్ నూతనంగా చేరిన 27 మంది ఉపాధ్యాయులకు జాయినింగ్ ఆర్డర్లు ఇచ్చారు. ఎంఎంసీ పరిధిలో 24 మంది ఎస్‌జీటీలు, ఇద్దరు తెలుగు స్కూల్ అసిస్టెంట్లు, 1 సోషల్ స్కూల్ అసిస్టెంట్‌కు నియామక పత్రాలు అందజేశారు.

బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

ఇంటర్ ఉద్యోగుల సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు

విజయవాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం నూతన కార్యవర్గం అంకితభావం, బాధ్యతాయుతంగా పనిచేస్తోందని ఇంటర్ ఉద్యోగుల సేవా సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షుడు ఏ శ్రీనివాసులు అన్నారు. నగరంలోని గాంధీనగర్‌లో ఎన్జీజీవో హోంలో సోమవారం రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. నూతన కార్యవర్గంలో సహాధ్యక్షుడిగా ఐ రాంబాబు, ఉపాధ్యక్షుడిగా ఎస్డీ అబ్దుల్ సమద్, యూ యోసేపు, ఈవీ రాఘవేంద్ర గౌడ్, టీ మధుస్వామి, ప్రధాన కార్యదర్శి బీవీ సుధాకర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా పీ సురేష్ తదితరులు నియమితులయ్యారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీ బీసీహెచ్ సుధాకర్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఐటీ సంస్థల స్థాపనకు గుడివాడ బెస్ట్ ఛాయిస్

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



గుడివాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గుడివాడను గ్లోబల్ సిటీగా చూడాలనేది తన లక్ష్యమని, ఈ క్రమంలో ఐటీ సంస్థలు నెలకొల్పేందుకు మంచి అవకాశాలున్నాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. సోమవారం అమెరికా న్యూజెర్సీలోని ప్రిన్స్‌స్టన్ ఐటీ సంస్థ కేంద్ర కార్యాలయంలో ప్రముఖ ఐటీ నిపుణులతో మీట్ అండ్ గ్రీట్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే గుడివాడలో ప్రిన్స్‌స్టన్ సంస్థ తన కార్యకలాపాల ను విజయవంతంగా కొనసాగిస్తోందని, సంస్థను నెలకొల్పిన రవి కా రంశెట్టికి ధన్యవాదాలు తెలిపారు. గుడివాడ పరిసర గ్రామాల్లో ప్రతిభావంతులకు కొదవలేదని, ఐటీ సంస్థలు నెలకొల్పే వారికి అన్ని విధాలుగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. పీ-4 స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా ప్రవాసాంధ్రులతో అనేక సమావేశాలు నిర్వహించామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో మంచి లక్ష్యంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పీ-4లో ప్రవాసాంధ్రులు భాగస్వామ్యులు కావాలని కోరారు. ప్రిన్స్‌స్టన్ సంస్థ సీఈవో రవి మాట్లాడుతూ గుడివాడలో ఉద్యోగాలిచ్చేందుకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఎందరో ప్రతిభావంతులు పాల్గొన్నారన్నారు. ఊహించిన దానికంటే రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక యంత్రాంగం, ప్రజలు సహకారం అందించారన్నారు. పలువురు ఐటీ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

మంత్రి ఉపసంఘం ఏర్పాటు అభినందనీయం

● స్వాగతించిన సంఘం రాష్ట్ర చైర్మన్ జానీపాషా

విజయవాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించి 10 మంది మంత్రులతో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తూ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ జీవోఆర్‌టీ నెం.1859ను విడుదల చేయడాన్ని గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర చైర్మన్ ఎండీ జానీపాషా సోమవారం ఒక ప్రకటనలో స్వాగతించారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల పదోన్నతులు, ఇతర ప్రభుత్వ శాఖల్లో పదోన్నతులతో విలీనం చేయాలని ఐక్యవేదిక తరపున కృషి ఫలించిందని జానీపాషా అన్నారు. మంత్రివర్గ ఉప సంఘం త్వరగా గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులకు న్యాయం చేస్తూ నిర్ధిష్ఠ గడువులోగా పదోన్నతులు కల్పించాలన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న డీసీపీ ఉదయకుమారి

పోలీస్ పీజీఆర్ఎస్‌లో 72 ఫిర్యాదులు

విజయవాడ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి 72 ఫిర్యాదులను స్వీకరించినట్టు డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) ఏటీటీఎస్ ఉదయరాణి తెలిపారు. ఆస్తి వివాదాలపై 41, కుటుంబ కలహాలపై నాలుగు, కొట్లాటలపై ఒకటి, మోసాలపై మూడు, మహిళా సంబంధిత నేరాలపై ఆరు, చోరీలపై రెండు, చిన్నచిన్న వివాదాలపై 15 మంది ఫిర్యాదులిచ్చినట్టు చెప్పారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన అనంతరం ఫిర్యాదులను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు బదిలీ చేసినట్టు తెలిపారు. నిర్ణీత కాలవ్యవధిలో ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు చెప్పారు.

భారత కబడ్డీ జట్టుకు హరీష్ ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి 31 వరకు బహ్రెయిన్‌లో జరిగే 3వ ఏషియన్ యూత్ గేమ్స్ పాల్గొనే ఇండియన్ కబడ్డీ (అండర్-18) జట్టులో రాష్ట్ర క్రీడాకారుడు గద్దె హరీష్ ఎంపికయ్యాడు. క్రీడాశాఖ మంత్రి ఎంరాంప్రసాద్ రెడ్డి, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, ఏపీ కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేవీ ప్రభావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ అర్జునరావు, జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ అభినందనలు తెలిపారు.

జీఎస్టీ సంస్కరణలతో ఊరట

● మంత్రి కొల్లు రవీంద్ర



స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరిందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. జడ్పీ కన్వెన్షన్ హాలులో వారం పాటు జరిగే బందరు బొనాంజ షాపింగ్ ఫెస్టివల్‌ను ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి సోమవారం ప్రారంభించారు. రోల్డ్ గోల్డ్ ఆభరణాలు, ఆప్కో, కలంకారీ వస్త్రాలు, వ్యవసాయ డ్రోన్‌లు, పిచికారీ యంత్రాలు, ఔషధాలు, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, టెలివిజన్లు, వాషింగ్ మిషన్లు, స్టేషనరీ, హెల్త్ ఇన్సూరెన్సు, నిత్యావసర వస్తువుల స్టాల్స్‌ను సందర్శించారు. గతంలో ఉన్న ధరలకు జీఎస్టీ తగ్గింపుతో వచ్చిన వ్యత్యాసాలను అడిగి తెలుసుకున్నారు. రోల్డ్ గోల్డ్ స్టాల్‌లోని నగలను సందర్శించిన మంత్రి రవీంద్ర ఈ సందర్భంగా పచ్చిగోళ్ల బుజ్జి అనే మహిళకు రోల్డ్ గోల్డ్ గాజులను కొనిచ్చారు. కన్వెన్షన్ హాలు వెలుపల ఉన్న వరికోత యంత్రాలు, ట్రాక్టర్లు, కార్లు, ద్విచక్ర వాహనాల ప్రదర్శన తిలకించి ధరలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలతో ప్రజల ఆదాయ మార్గాలు గణనీయంగా పెరిగాయన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఎన్‌డీఏ ప్రభుత్వం వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ను తగ్గించి ప్రజలకు పన్నుభారం నుంచి ఉపశమనం కలిగించిందన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ మొదటిసారిగా జీఎస్టీ తగ్గించి వ్యవసాయ పనిముట్లు రైతులకు తక్కువ ధరకు లభించాయన్నారు. కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ప్రజలు వస్తువులపై కొనుగోలు చేసే ఖర్చు తగ్గిపోయిందన్నారు. జాయింట్ కలెక్టర్ నవీన్, జీఎస్టీ ప్రచార కమిటీ జిల్లా కో-ఆర్డినేటర్, వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ కల్పన, అడిషనల్ కమిషనర్ బాబూరావు, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, మెప్మా పీడీ సాయిబాబు, మార్కెట్‌యార్డు చైర్మన్ కుంచె నాని, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ దిలీప్ పాల్గొన్నారు.

స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తి వ్యాప్తి చెందాలి

చల్లపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తి అవనిగడ్డ నియోజకవర్గమంతటా వ్యాప్తి చెందాలనీ, స్వచ్ఛ అవనిగడ్డ నియోజకవర్గం అయ్యేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషిచేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. స్వచ్ఛాంధ్ర అవార్డు గ్రహీతలకు చల్లపల్లి చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో చల్లపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014లో చినుకులా ప్రారంభమైన స్వచ్ఛఉద్యమం వరదలా మారి ఉప్పెనలా మారటంతో స్వచ్ఛతా స్ఫూర్తి ఎందరికో ఆదర్శంగా నిలిచిందన్నారు. ఏడాదిలోగా చల్లపల్లి జాతీయ అవార్డును అందుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి శనివారం స్వచ్ఛాంధ్ర మొక్కుబడితంతుగా కాకుండా చిత్తశుద్ధితో చేయాలనీ, ఇకపై ప్రతి 3వ శనివారం ప్రభుత్వ కార్యాలయాలను సందర్శిస్తాననీ, స్వచ్ఛ సుందర కార్యాలయాలను ఎంపికచేసి నగదు బహుమతి అందిస్తానని ప్రకటించారు. అధికార వ్యవస్థ నిస్తేజంగా మారటం ఆవేదనను కలిగిస్తోందన్నారు. డీపీవో జే అరుణ మాట్లాడుతూ, కార్యదర్శులు అంకితభావంతో పనిచేయాలనీ, గ్రామాల్లో పరిశుభ్రత కోసం కృషిచేయాలన్నారు. స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ స్వచ్ఛ చల్లపల్లి సాధించిన మొదటి విజయం ఓడీఎఫ్ సాధించటమనీ, 11 ఏళ్లుగా స్వచ్ఛ చల్లపల్లి ద్వారా గ్రామంలో పచ్చదనం, హరితవేడుకల వంటి ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. ప్రత్యేకాధికారి పీ సాయిబాబు అధ్యక్షతన జరిగిన సభలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, యువనేత మండలి వెంకట్రామ్, డాక్టర్ పద్మావతి, ఏఎంసీ చైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, కార్పొరేషన్ డైరెక్టర్లు బోలెం నాగమణి, పైడిపాముల స్వప్న, ఎంపీపీ కోట విజయరాధిక, వైస్‌ఎంపీపీ పిట్టి వెంకటేశ్వరమ్మ, ఎంపీడీవో ఆనందకుమారి, సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, సొసైటీ చైర్మన్ యార్లగడ్డ లంకబాబు, టీడీపీ నేత యార్లగడ్డ శ్రీనివాసరావు తోపాటు ప్రజాప్రతినిధులు, నియోజకవర్గంలోని కార్యదర్శులు, స్వచ్ఛ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర అవార్డు గ్రహీతలకు ఎమ్మెల్యే, డీపీవో ఘన సన్మానం



స్వచ్ఛాంధ్ర అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డీపీవో అరుణ తదితరులు

అవార్డుగ్రహీతలకు ఘన సన్మానం

స్వచ్ఛ ఆంధ్ర రాష్ట్రస్థాయి అవార్డు సాధించిన సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పీవీ మాధవేంద్రరావు, మన కోసం మనం ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్-డాక్టర్ పద్మావతి దంపతులు, చల్లపల్లి ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బీఎస్ఆర్ శ్రీనివాస్, అంగన్‌వాడీ కార్యకర్త షేక్ ముంతాజ్‌బేగం, గ్రీన్ అంబాసిడర్ సాంతల జయలక్ష్మిలతోపాటు నాగాయలంక సర్పంచ్ కైతేపల్లి అంకాలు, కార్యదర్శి పవన్‌కుమార్, మోపిదేవి గ్రీన్ అంబాసిడర్ కర్లపూడి కోటేశ్వరరావులను ఎమ్మెల్యే, డీపీవోలు ఘనంగా సన్మానించారు. మహాత్మా గాంధీ, మండలి కృష్ణారావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

బంగారం పేరుతో కుచ్చుటోపీ

రూ.5కోట్లతో పారిపోయిన కేటుగాడు

పెనుగంచిప్రోలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బంగారంపై మక్కువతో కొందరు, భవిష్యత్‌కు భరోసా కోసం కొందరు ఆశపడి మోసగాడి బారినపడ్డారు. పేదల ఆశను ఆసరా చేసుకొని వాయిదాల పద్ధతిలో బంగారం అందిస్తానని నమ్మబలిక కేటుగాడు ఉన్నందంతా ఊడ్చాడు. ప్రజలను వంచించిన చిన దుర్గారావు అర్ధరాత్రి పరారయ్యాడు. సుమారు రూ.5కోట్ల మేర ముంచిన వంచకుడు కుటుంబంతో కలిసి పర్యారయ్యాడు. విషయం తెలుసుకున్న బాధితులు రోదిస్తూ పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే మండల కేంద్రమైన పెనుగంచిప్రోలుకు చెందిన చిన్నం చిన దుర్గారావు అనే చిరు వ్యాపారి రెండు దశాబ్దాలుగా బట్టల వ్యాపారం చేస్తూ నమ్మకస్తుడిగా పేరు తెచ్చుకున్నాడు. అతడికి భార్య ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. వారికి పెళ్లిళ్లు చేసి ఐదేళ్ల క్రితం కుమారుడితో బట్టల షాపు పెట్టించాడు. తాను వినాయకుడి గుడి సెంటర్‌లో షాపు అద్దెకు తీసుకొని హోమ్ నీడ్స్ వ్యాపారం చేస్తున్నాడు. ఈక్రమంలోనే తనకున్న పరిచయాలతో చిట్టీలు కట్టించడం ప్రారంభించారు. తరువాత బంగారం స్కీమ్‌కు తెరలేపాడు. బంగారం ధరలు ఆకాశాన్నంటి పేదలు కొనలేని స్థితికి చేరుకోవడంతో కుట్ర పన్నాడు. ఒకే దఫా గ్రాము బంగారం కొనలేని పేదలకు వాయిదా పద్ధతిలో బంగారం అందిస్తానని నమ్మబలికాడు. సుమారు 150 మంది చేరారు. ఐదేళ్ల పాటు పక్కా ప్రణాళికతో ప్రజలను నమ్మించి రూ.5కోట్లకు పైబడి సొమ్ము చేతికి చేరిన తరువాత దెబ్బతీశాడు. కొన్నాళ్లుగా ఎవరికీ పేమెంట్లు చేయకపోవడం, బంగారం ఇవ్వకపోవడంతో అనుమానంతో కొందరు నిలదీశారు. దీంతో శుక్రవారం రాత్రి చిన దుర్గారావు, భార్య, కుమారుడి కుటుంబంతో పలాయనం చిత్తగించాడు. 3 రోజులుగా హోంనీడ్స్ షాపు, కుమారుడి బట్టల షాపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు ఇంటికి వెళ్లి పరిశీలించగా ఆచూకీ లేదు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ఐదు కోట్ల వరకూ మోసం చేసినట్లు తెలుస్తుంది. ఈ మొత్తం కూడా ఇంకా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మల్లవల్లి సిగలో మరో మణిహారం వాయుపుత్ర

రాష్ట్రంలోనే మొదటి పర్యావరణహిత 'వేగా' సీలింగ్ ఫ్యాన్ల ఉత్పత్తి ప్లాంట్



ఆంధ్రజ్యోతి, హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్రానికే తలమానికమైన మల్లవల్లి పారిశ్రామికవాడలో మరో మణిహారమైన పరిశ్రమ ఏర్పడుతోంది. రాష్ట్రంలోనే మొదటి పర్యావరణహిత సీలింగ్ ఫ్యాన్ల ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటు జరుగుతోంది. వాయుపుత్ర ఎకో సిస్టం అత్యాధునిక ఫీచర్లతో కూడిన సీలింగ్ ఫ్యాన్ల ఉత్పత్తి ఫ్యాక్టరీని మల్లవల్లిలో ఏర్పాటు చేసింది. ప్రస్తుతానికి లీజుకు తీసుకున్న ఆవరణలో ఫ్యాన్ల ఉత్పత్తి ప్రారంభించనున్నట్టు ఎండీ విజయ్‌కుమార్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. తక్కువ కరెంటుతో అత్యాధునిక సాంకేతికతతో కూడిన సీలింగ్ ఫ్యాన్లను అక్టోబరు నెలాఖరు నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే ధరలతో డీలర్ సిస్టంను ఏర్పాటు చేసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం సహకరించి తమకు స్థలం కేటాయిస్తే ఉత్పత్తిని పెంచుతూ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేలా రూ.20 కోట్లకు పైగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతామని ఆయన తెలిపారు. తన స్వగ్రామం రంగన్నగూడెం కావడంతో తన స్వంత మండలానికి చెందిన వారికి ప్రాధాన్యత ఇచ్చేలా ఉద్యోగావకాశాలు కల్పిస్తానన్నారు.





ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ

ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలి

● కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలను వచ్చే అర్జీలలోని సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జేసీ నవీన్, డీఆర్వో కే చంద్రశేఖర్, డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆర్డీవో స్వాతి, హౌసింగ్ పీడీ పోతురాజుతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. 109 అర్జీలను వారు స్వీకరించారు. డ్వామా సీడీ శివప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఈ సోమశేఖర్, డీపీవో డాక్టర్ జే అరుణ, డీఈవో పీ విజయరామారావు, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకట్రావు, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు శివరామప్రసాద్, బీసీ సంక్షేమాధికారి రమేష్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు మురళీ కిషోర్ పాల్గొన్నారు.

వృద్ధాప్య పింఛను ఇప్పించండి మహాప్రభో..!

మా ఊరు కాజ గ్రామం. తండ్రి జోగి సుబ్బారావు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. మా తండ్రి గారికి న్యూఢిల్లీలో కాంస్య పతకం, పెన్షన్ ఇచ్చి గౌరవించారు. ఆ కుటుంబానికి చెందిన తనకు వృద్ధాప్య పింఛను ఇప్పించాలని ఏడాది నుంచి తిరుగుతున్నా. వయస్సు 64. అంటూ కాజ గ్రామానికి చెందిన జోగి పాండురంగారావు మీకోసంలో కలెక్టర్‌కు మొర పెట్టుకున్నాడు.



యువజనోత్సవాల పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

యువజనోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): యువతలో కళానైపుణ్యం, జాతీయ భావం పెంపొందించడంలో భాగంగా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 23న జిల్లాస్థాయి యువజనోత్సవాలు జరుగనున్నాయని, యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి యువజనోత్సవాల పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజయవాడ కొత్తపేట కేబీఎన్ కళాశాలలో యువజనోత్సవాలు జరుగనున్నాయని, జిల్లా స్థానికత ఉన్న యువత పాల్గొనవచ్చన్నారు. పలు అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా యువజన సంక్షేమాధికారి యూ శ్రీనివాసరావు తెలిపారు. ఔత్సాహికులు ఆన్‌లైన్ లింక్ ద్వారా ఈనెల 22లోపు పేర్లు నమోదు చేసుకోవాలని లేదా వేదిక వద్ద 23న ఉదయం పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9949522694, 9032115987 నెంబర్లలో కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

నేడు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

ప్రభుత్వాసుపత్రి: ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఈ నెల 14న మంగళవారం నిర్వహిస్తున్నట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీ రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసుపత్రి సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జీ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఆసుపత్రికి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను సమావేశంలో చర్చిస్తారన్నారు.

ఎట్టకేలకు కానిస్టేబుల్‌కు వైద్యం

ప్రాణాపాయం లేదని వైద్యులు నిర్ధారణ..

క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు

జగ్గయ్యపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారులు వేధింపులు భరించలేక పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశానని చెప్పి హైడ్రామా సృష్టించి ప్రభుత్వాసుపత్రిలో చికిత్సకు నిరాకరించి అదృశ్యమైన చిల్లకల్లు పోలీస్ కానిస్టేబుల్ మేజర్ల నాగశ్రీను (38)ను ఎట్టకేలకు జగ్గయ్యపేట సర్కిల్ పోలీసులు పట్టుకుని విజయవాడలో ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్సకు పంపించారు. ఆదివారం మధ్యాహ్నం ఒక కేసుకు సంబంధించి రికార్డు కోసం స్టేషన్ నుంచి ఒక కానిస్టేబుల్‌తో ఫోన్ చేయించగా, సెలవులో ఉన్న తనను డ్యూటీకి రమ్మని వేధిస్తున్నారని ఆరోపిస్తూ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన నాగశ్రీను ప్రభుత్వాసుపత్రిలో చేరటంతో తెలుసుకున్న సీఐ వెంకటేశ్వర్లు, చిల్లకల్లు ఎస్సై శ్రీనివాస్, పేట ఎస్సై రాజు హటాహుటిన ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈలోగా తనకు చికిత్స వద్దని సెలైన్ తీసేసుకుని వెళ్లిపోయాడు. విజయవాడ రిఫర్ చేసినా ససేమిరా అన్నారు. అతడికి ప్రాణాపాయం అవుతుందని భావించిన అతడిని పట్టుకుని స్థానికంగా ఒక ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడ నుంచి విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సోమవారం పరిస్థితి నిలకడగానే ఉందని, ప్రాణాపాయం లేదని నిర్ధారించారు. ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్న సీఐ వెంకటేశ్వర్లు ఆయా వివరాలను సీపీ దృష్టికి తీసుకు వెళ్లారు. 2 నెలలుగా విధులకు సక్రమంగా హాజరు కావటం లేదని, రెండు రోజుల క్రితం వచ్చి సెలవు కావాలన్నా చిల్లకల్లు ఎస్సై సరేనని పంపేశారని, కీలక కేసులో రికార్డు కోసం రమ్మంటే ఇలా ఆత్మహత్యాయత్నం చేసినట్టు సీపీకి తెలిపారు. విధి నిర్వహణలో అలక్ష్యంగా వ్యవహరించటమే కాకు, తోటి అధికారులపై అసంబద్ధమైన ఆరోపణలు, ఫిర్యాదులు చేసిన చిల్లకల్లు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ మేజర్ల నాగ శ్రీనుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సీపీని కోరతామని సీఐ పీ వెంకటేశ్వర్లు చెప్పారు.



చలి గాలి.. చిరు జల్లు

● జిల్లాలో చల్లని గాలులతో కూడిన వర్షం ● ఉపరితల ఆవర్తన ప్రభావంతో మరో రెండు రోజులు తేలిక పాటి జల్లులు

విజయవాడ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో జిల్లాలో సోమవారం చిరుజల్లులు కురిశాయి. సముద్ర మట్టానికి సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించిన ఆవర్తనంతో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీచాయి. తెల్లవారు జామున తేలికపాటి జల్లులు కురిశాయి. తరువాత కొద్ది సేపు వర్షం జాడ లేదు. తిరిగి 11.30 గంటల నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ముసురుతో కూడి దాదాపు గంట పాటు కురిసిన వర్షానికి నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇదే సమయంలో వర్షానికి చల్లని గాలులు తోడవడంతో జన సంచారం కొద్ది సేపు స్తంభించింది. తిరిగి సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఓ గంట పాటు తేలిక పాటి చిరుజల్లులు కురిశాయి. అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురు వాతావరణం ఉంది. నేడు, రేపు ఇదే వాతావరణ పరిస్థితులు ఉండవచ్చని వాతావరణ శాఖ ప్రకటించింది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525



జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న రామ్ ఫణీంద్ర

జీఎస్టీపై అవగాహన

కూచిపూడి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీతో సామాన్యులు రోజు వినియోగించుకునే వస్తువులకు పెద్దపీట వేయటంతో ఆహార పదార్థాలపై పన్ను భారం తగ్గిందంటూ కూచిపూడి పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ అప్పికట్ల రామ్ ఫణీంద్ర పేర్కొన్నారు. జీఎస్టీపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా సోమవారం దుకాణదారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పి.ఉమామహేశ్వరరావు, ఏ.అరుణ, కె.యామిని, ప్రదీప్, డ్వాక్రా లీడర్ లక్ష్మీ పాల్గొన్నారు.

పొరబడితే .. ప్రమాదమే..

● వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ ధ్వంసం
● పట్టించుకోని అధికారులు

(గుడివాడ రూరల్ - ఆంధ్రజ్యోతి): సిద్ధాంతం - చౌటపల్లి గ్రామాల మధ్య ఉన్న ఒక పంట కాలువ, మురుగు కాలువకు రెయిలింగ్ లేకపోవటంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వంతెన బందరు నుంచి వచ్చే ప్రయాణీకులు కైకలూరు, కలిదిండి, రుద్రపాక గ్రామాల ప్రజలు గుడివాడ వెళ్లకుండా బైపాస్ రోడ్డుగా ఉపయోగపడుతుంది. భీమవరం, కైకలూరు, కలిదిండి వెళ్లే ప్రయాణీకులు గుడివాడ వెళ్లకుండా బందరు, పామర్రు వెళ్లటానికి బైపాస్‌లాగా ఉపయోగిపడుతుంది. రెండు కాలువలపైన రెయిలింగ్ ఊడిపోయి సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకోవటం లేదు. ముఖ్యంగా భారీ వాహనాలు ఈ వంతెన మీదుగా వెళ్తున్నాయి. గుడివాడ - భీమవరం రైల్వే గేటు వద్ద పై ఓవర్ నిర్మాణం జరుగుతున్నందున ఎక్కువ మంది వాహనదారులు ఈ రహదారిపైనే వెళ్తున్నాయి. ఏ క్షణమైన భారీ వాహనాలు పంట కాలువలో పడటం కానీ, వంతెన కూలిపోయే పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి వంతెనపై ధ్వంసమైన రెయిలింగ్‌కు మరమ్మతులు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.



వంతెనపై ధ్వంసమైన రెయిలింగ్

అంచనాలు రూపొందించాం

వంతెనపై ధ్వంసమైన రెయిలింగ్ నిర్మాణానికి అంచనాలు రూపొందించి, అధికారులకు పంపించాం. నిధులు మంజూరవగానే మరమ్మతు పనులు చేపడతాం.

సూర్య భరత్, ఇరిగేషన్ డీఈ

విద్యార్థులకు క్రీడాదుస్తుల పంపిణీ



విద్యార్థులకు క్రీడాదుస్తులు పంపిణీచేస్తున్న బొబ్బా ప్రకాశ్

పమిడిముక్కల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో శారీరిక ధారుడ్యం, మానసిక ఉల్లాసంతో పాటు ఉత్తమ క్రీడాకారులుగా పేరు ప్రఖ్యాతులు గడించవచ్చని అగినపర్రు గ్రామ ప్రముఖుడు బొబ్బా ప్రకాశ్ అన్నారు. అగినపర్రులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 23 మంది విద్యార్థులకు సోమవారం క్రీడాదుస్తులు పంపిణీచేశారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ప్రోత్సాహంతో పీ-4 పథకం ద్వారా విద్యార్థులకు క్రీడాదుస్తులు పంపిణీ చేశామన్నారు. చిగురుపాటి కృష్ణారావు, బాలకృష్ణ, వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీఈటీ వెంకటేశ్వరరావు, సుబ్రమణ్యం, ఎన్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దాడి కేసులో ముద్దాయికి రిమాండ్

గుడివాడ రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో గల మల్లాయిపాలెం టిడ్కో కాలనీ వద్ద ఉన్న వైన్ షాపు వద్ద ఆదివారం రాత్రి 7.30 గంటల సమయంలో అదే కాలనీలో నివాసం ఉండే మిండాల మోషే (20) అనే వ్యక్తి, పంచవటి కాలనీకి చెందిన ఉప్పతల తిమోను అనే వ్యక్తిపై దాడికి పాల్పడ్డాడు. తీమోనుకు బాధితుడి చెల్లితో వివాహ సంబంధం చేసుకోవటానికి ఆమె అన్న అయిన మిండాల మోషే అడ్డుపడ్డాడు. తనకు చెడు అలవాట్లు ఉన్నాయని నెపంతో అడ్డుపడ్డాడనే కక్ష పెట్టుకుని తీమోను అనే వ్యక్తి మిండాల మోషేపై బీరు సీసాతో తలమీద కొట్టాడు. దీంతో తీవ్ర గాయమై అపస్మారక స్థితిలో ఉన్న మోషేను వెంటనే ఈవీఆర్ హాస్పటల్‌లో జాయిన్ చేశారు. బాధితుడి తల్లి మెండాల గురవమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్ ట్రైనీ మహిళా ఎస్సై లోకేశ్వరి కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం ముద్దాయిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి ముద్దాయికి 14 రోజులు రిమాండ్ విధించి, జైలుకు తరలించారు.



నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న సిబ్బంది

నూతన కార్యవర్గానికి సత్కారం

గుడివాడ రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బొమ్ములూరు కార్యదర్శి ఆర్.రామ్మోహనరావును పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవటం జరిగింది. లింగవరం కార్యదర్శి కె.అనూలను జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా ఎన్నుకోవటం జరిగింది. వీరిరువురిని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఎంపీడీవో విష్ణుప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు తదితరులు అభినందనలు తెలియజేశారు.

రహదారికి మరమ్మతులు చేపట్టాలని వినతి

పెదపారుపూడి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భూషణగుళ్ల గ్రామ ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమై ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో గ్రామస్థులైన సంపంగి శ్రీకాంత్, కాకా రమేష్ బాబులు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌ని స్వయంగా కలసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రహదారి అధ్వాన్నంగా మారింది. దీంతో ప్రజలు, విద్యార్థులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.



ప్రార్థనల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

ఘనంగా గ్యార్మీ వేడుకలు

గుడివాడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : ముస్లిం సోదరులకు ఎంతో ప్రవితమైన గ్యార్మీ షరీఫ(జెండాల పండుగ)ను స్థానిక 11వవార్డులోని షాహీ నూర్ జెండా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు సయ్యద్ జబీన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ప్రార్థనల్లో మతపెద్దలతో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో గ్యార్మీ పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్, టీడీపీ నాయకులు వెనిగండ్ల రామకృష్ణ(నాని), చేకూరు జగన్మోహనరావు, లింగం ప్రసాద్, కడియాల గణేష్, పట్టపు చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఆర్ వజ్రోత్సవ నిర్వహణ కమిటీ ఏర్పాటు

గుడివాడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : అక్కినేని నాగేశ్వరరావు కళాశాల డైమండ్ జూబ్లీ(వజ్రోత్సవాలు) ఉత్సవాలను డిసెంబరు 16,17,18తేదీల్లో నిర్వహించనున్నామని కళాశాల కార్యదర్శి కె.ఎస్ అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేయడానికి నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కమిటీ గౌరవాధ్యక్షుడిగా కె.ఎస్ అప్పారావు, ఛైర్మన్‌గా కొల్లి శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్‌గా పర్వతనేని కృష్ణప్రసాద్, కార్యదర్శిగా డాక్టర్ సూరపనేని శ్రీనివాసరావు, కోశాధికారిగా పునుకొల్లు రాజభూషణరావు, సభ్యులుగా ఉపద్రష్ట రామస్వామిశాస్త్రి, ఎల్ఆర్‌కే ప్రసాద్, బొప్పన రామకుటుంబరావు, డాక్టర్ పి.జె.ఎస్ కుమార్, కొల్లి రమణకుమార్‌లను నియమించినట్టు తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

● డాక్టర్ మాగంటి శ్రీనివాస్

గుడివాడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని ఐఎంఏ గుడివాడ శాఖ అధ్యక్షుడు డాక్టర్ మాగంటి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం స్థానిక సత్యనారాయణపురంలోని ఐఎంఏ హాల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ, ఐఎంఏల సంయుక్త ఆధ్వర్యంలో సీపీఆర్(కార్డియో పలమనరీ రీసక్సీటేషన్)పై అవగాహన సదస్సును నిర్వహించారు. విజయవాడ అంకురా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పి.అనురాధ, డాక్టర్ వి.నాగరాజులు ప్రైవేట్ ఆసుపత్రుల సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాగంటి, ప్రముఖ వైద్యులు డాక్టర్ పొట్లూరి వంశీలు మాట్లాడుతూ కరోనా తరువాత గుండె సంబంధిత మరణాలు పెరిగాయని, ఇటీవల ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి క్రికెట్ ఆడుతూ మృతి చెందడం బాధాకరమన్నారు. విద్యార్థుల్లో సీపీఆర్‌పై అవగాహన ఉండి ఉంటే విద్యార్థికి ప్రాణభిక్ష లభించేదన్నారు. వివిధ రంగాలకు చెందిన వారు, పౌరులు, ఆర్‌ఎంపీ వైద్యులు సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉంటే మరణాలను నివారించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు యలమంచిలి నాగేశ్వరరావు, కార్యదర్శి గుళ్లపల్లి కిరణ్‌బాబు, అసిస్టెంట్ గవర్నర్ ముళ్లపూడి రమణమూర్తి, పూర్వ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, పి.చంద్రశేఖరరావు, బి.శంకరరావు, పి.రామకృష్ణ, శ్రీనివాస్ చౌదరి, ఏ.జే ప్రసాద్, బి.రామారావు, వీవీఆర్ రెడ్డి, కె.శ్రీనివాస్, ఉదయభాస్కరరాజు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఆర్థిక సాయం

గుడివాడ : స్థానిక ఆటోనగర్‌లో టైర్ వర్కర్‌గా పనిచేస్తున్న స్థానిక గుడ్‌మెన్‌పేటకు చెందిన అబ్దుల్ సిలార్ ఇటీవల ప్రమాదంలో ఎడమచెయ్యి విరగడంతో సోమవారం ది గుడివాడ ఇండస్ట్రీయల్ అండ్ ఆటోమొబైల్స్ యూనియన్ ఆటోనగర్ కమిటీ నాయకులు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.లక్ష్మణరావు, అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, నాయకులు ఆంజనేయులు, మొహిద్దీన్ భాషా, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఏ-2 పరీక్షలు ప్రారంభం

కూచిపూడి: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ నెల 15 వరకు నాలుగు రోజులపాటు జరిగే ఎఫ్ఏ-2 పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు జరిగే ఈ పరీక్షలు మొవ్వలో 9 జడ్పీ పాఠశాలలు, ఒక ఎయిడెడ్ పాఠశాల, 46 ఎంపీ ఎలిమెంటరీ, రెండు ఎంపీ యూపీ, 12 ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5356 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు.

వృద్ధులకు భోజన వసతి

గుడివాడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఏలూరురోడ్డులోని కర్ల వృద్ధాశ్రమంలో సీసీఎస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంజరపు రమణి మాతృమూర్తి ఇంజరపు రమణమ్మ 6వ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్, పి.రమణ, సీసీఎస్ ఏఎస్సై వెంకటేశ్వరరావు, రైటర్ రాంబాబు, కానిస్టేబుల్ బాలు, సంఘ సభ్యులు తాతారావు, వృద్ధాశ్రమ నిర్వాహకులు కర్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన పంచాయతీల అప్‌గ్రేడ్

గుడ్లవల్లేరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లోనూ పట్టణ తరహా సేవలు ప్రజలకు అందించే కొత్త విధానాన్ని కూటమి ప్రభుత్వం రూపొందించింది. వార్షిక ఆదాయం, జనాభా ప్రాతిపదికన పంచాయతీలను అప్‌గ్రేడ్ చేయనున్నారు. పదివేల జనాభా దాటిన పంచాయతీ లేదా కోటిరూపాయిలు ఆదాయం ఉన్న పంచాయతీలు ఇకపై గ్రేడ్ 1 గ్రామపంచాయతీలుగా కాక రూరల్ అర్బన్ పంచాయతీలుగా మారనున్నాయి. ఈ పంచాయతీల్లో పురపాలక తరహా సేవలను అందించే విధంగా రూపొందించారు. గ్రామీణ ప్రణాళిక, ప్రజారోగ్యం, వీధిదీపాలు, తాగునీటి సరఫరా, ఇంజనీరింగ్ విభాగాలు ఏర్పాటు చేస్తారు. సిబ్బంది సంఖ్య పెంపు చేస్తారు. పంచాయతీ గ్రేడ్ కార్యదర్శులకు బదులుగా పంచాయతీ అభివృద్ధి అధికారి(పీడీవో)లు డిప్యూటీ ఎంపీడీవో స్థాయి అధికారుల పాలనలో ఈ రూరల్ అర్బన్ పంచాయతీలు పాలనలో ఉండనున్నాయి. కాగా పంచాయతీ లకు వచ్చే మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిపథకం నిధులకు బదులుగా కేంద్ర నిధులు అమృత్ పథకం నిధులు అభివృద్ధికి కేటాయిస్తారని వినికిడి. ఈ రూరల్ అర్బన్ పంచాయతీలపై క్యాబినెట్ ఆమోదంతో తదుపరి చర్యల దిశగా పంచాయతీరాజ్ శాఖ అడుగులు వేస్తోంది. ప్రభుత్వ జీవో రావడమే తరువాయి 359 రాష్ట్రంలో పంచాయతీలు రూరల్ అర్బన్ పంచాయతీలుగా మారనున్నాయి. గుడ్లవల్లేరు పంచాయతీ మాత్రమే రూరల్ అర్బన్ పంచాయతీగా అప్‌గ్రేడ్ అయ్యే అవకాశం ఉంది. ఈ విధానం వల్ల పంచాయతీ సిబ్బంది పెరుగుదల, ట్యాక్స్‌లు పెరుగుదలే కానీ గ్రామాలకు ఏమాత్రం ఉపయోగం ఉంటుందో అర్థం కావడంలేదని పలువురు పంచాయతీ రాజ్‌శాఖలోని సీనియర్స్ విశ్రాంత అధికారులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అప్‌గ్రేడ్ అయ్యి అభివృద్ధికి దూరమైతే ఏం ప్రయోజనం ఉంటుందని పలువురు గ్రామస్థులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో దీనిపై ప్రజలకు అవగాహన పరచాల్సిన అవసరం ఉంది.



గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ కార్యాలయం



జాతీయ రహదారిపై నిలిచిన వర్షం నీటిని డ్రైనేజీలకు మళ్లిస్తున్న పంచాయతీ సిబ్బంది

నిలిచిన మెయింటినెన్స్ పనులు

గుడ్లవల్లేరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) :కొండనాలికకు మందేస్తే ఉన్ననాలుక ఊడిందన్న చందాన ఎంఎన్‌కే జాతీయ రహదారి మెయింటినెన్స్ పనులు ఉన్నాయి. అంగలూరు, గుడ్లవల్లేరు మీదుగా వెళ్లే ఈ జాతీయ రహదారికి ఇరువైపులా రోడ్డుపై మట్టి పేరుకుపోయి ఉడటంతో దానిని నిర్మూలించే పనిని ఆర్అండ్ బీ చేపట్టింది. ఇంతవరకూ బానే ఉంది. డోజర్‌సహాయంతో రోడ్డుపై మట్టిని రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆర్అండ్‌బీ డ్రెయినేజీ వరకూ తొలగించలేదు. మార్జిన్ వరకూ తీసి వదిలేశారు. దాని కారణంగా వర్షం కురిసినపుడు రహదారిపై నీరు డ్రెయినేజిలోకి వెళ్లేందుకు ఉండే రంధ్రాలు పూడిపోయి నీరు డ్రెయినేజిలోకి పోకుండా రహదారిపైనే నిలిచి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. పని నిర్వహించే వారు పూర్తిస్థాయిలో నిర్వహించకుండా వదిలేయడం నిర్వాహకుల అలసత్వం వల్ల మంచి చేయాలనుకొన్నది కాస్తా ప్రయాణికులకు ఇబ్బందులకు గురిచేస్తోంది. అలా నిలిచిపోయిన నీటిని గుడ్లవల్లేరు పరిధిలో గుడ్లవల్లేరు పంచాయతీ సిబ్బంది డ్రెయినేజిల్లోకి మళ్లించి రహదారిపై నీరు నిలవకుండా చేస్తున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

● ఎంఈవో-1 రజనీ



ఎంఈవో రజనీకు జాయినింగ్ రిపోర్టు అందజేస్తున్న నూతన ఉపాధ్యాయులు

గుడివాడ రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఉపాధ్యాయులు చక్కగా విధులు నిర్వహించాలని ఎంఈవో-1 రజనీ అన్నారు. సోమవారం ఎంఈవో కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు తీసుకుంటున్న ఉపాధ్యాయులకు నియామకపత్రాలు అందజేశారు. పాఠశాలల్లో విద్యార్థులతో చక్కగా మెలగాలని అన్నారు. వారికి చక్కగా అర్థమయ్యేలా బోధించి పిల్లలు ఉన్నత స్థానానికి ఎదిగే విధంగా కృషి చేయాలని తెలిపారు. కుటుంబసభ్యులకు మంచి పేరు వస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా బాధ్యతలు తీసుకోవటం సంతోషకరమని, చక్కగా విద్యార్థులకు బోధించి మండలం పేరు నిలబెట్టాలని కోరారు.

కూచిపూడి : ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ 2025 ద్వారా ఎంపికైన 19 మంది ఉపాధ్యాయులు మొవ్వ మండలంలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో సోమవారం విధుల్లో చేరారు. మొవ్వ జడ్పీ పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు, చినముత్తేవిలో ఒకరు, కూచిపూడిలో ఒకరు, నిడుమోలులో ముగ్గురు, పెడసనగల్లులో నలుగురు, కోసూరులో ఐదుగురు ఉపాధ్యాయులు విధుల్లో చేరారు.

పామర్రు: కూటమి ప్రభుత్వం నిర్వహించిన మోగా డీఎస్సీ ద్వారా ఉత్తీర్ణులై, ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించి శిక్షణ అనంతరం పామర్రు కేటాయించిన 14మందిగాను 13మంది సోమవారం విధుల్లో జాయిన్ అయినట్లు మండల విద్యాశాఖ అధికారిణి గుమ్మడి పద్మవాణి తెలిపారు. వారికి సంబంధిత పాఠశాలల్లో మొత్తం హైస్కూల్ అసిస్టెంట్లుగా ఏడుగురు, సెకండరీగ్రేడ్ టీచర్లుగా ఐదుగురు బాధ్యతలు స్వీకరించారన్నారు. నూతనంగా కొలువుదీరిన ఉపాధ్యాయులకు ఎంఈవో ఆల్ ది బెస్ట్ చెప్పారు.



నందివాడలో విధుల్లోకి చేరిన ఉపాధ్యాయులు



మొవ్వ జడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం ఉమాశ్రీకి ఆర్డర్ కాపీ అందిస్తున్న ఉపాధ్యాయులు

నందివాడ: నందివాడ మండలానికి ఆరుగురు ఉపాధ్యాయులు జాయిన్ అయినట్లు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగురు ఉపాధ్యాయులు జాయినింగ్‌తో రెండు క్లస్టర్ పోస్టులు తప్ప మండలంలోని అన్ని పాఠశాలలకు ఉపాధ్యాయులు సరిపడా ఉన్నట్లు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525



సేంద్రియ ఎరువుతో మొక్కలను పెంచాలి : కలెక్టర్

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సేంద్రియ ఎరువుతో మొక్కల పెంపకం చేపడితే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించగలుగుతామని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఉదయపు నడక మిత్ర మండలి భవనంలో యోగ శిక్షణా తరగతుల్లో పాల్గొన్నారు. అనంతరం మొక్కలు నాటారు. సేంద్రియ ఎరువులతో మిద్దె తోట పెంచుతున్న ముంతాజ్ బేగం ఇంటిని సందర్శించారు. పర్యావరణ పరిరక్షణ నినాదాలు చూసి ఆమెను అభినందించారు. యోగా గురువులు మద్దాల చింతయ్య, వడ్డే శ్రీనివాస్, వెంకటేశ్వర ప్రసాద్, ఆర్. దుర్గాప్రసాద్, జగన్మోహనరావు, అశోక్ పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు అచ్యుతరామయ్య

• వర్ధంతి కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య



కంఠంనేని అచ్యుతరామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య, నేతలు

చల్లపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కంఠంనేని అచ్యుతరామయ్య ఆదర్శ కమ్యూనిస్టు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. మోపిదేవికి చెందిన కమ్యూనిస్టు నేత, నిస్వార్థ ప్రజాసేవకులు కామ్రేడ్ కంఠంనేని అచ్యుతరామయ్య 14వ వర్ధంతిని స్థానిక శ్రీ చండ్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో సోమవారం నిర్వహించారు. అచ్యుతరామయ్య చిత్రపటానికి నేతలు, కుటుంబసభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఈశ్వరయ్య మాట్లాడుతూ, తాను నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు జీవించిన మహోన్నత కమ్యూనిస్టునేత అచ్యుత రామయ్య అన్నారు. మహిళా సాధికారిత విద్యతోనే సాధ్యమని నమ్మిన ఆయన బాలికల విద్యాభ్యాసాన్ని ప్రోత్సహించారన్నారు. మూడు పర్యాయాలు సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించిన అచ్యుతరామయ్య కమ్యూనిస్టుల పాలనలో అభివృద్ధి ఏవిధంగా ఉంటుందో చేసి చూపించారని తెలిపారు. రెండు దశాబ్దాల క్రితమే వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి హెలికాప్టర్ ద్వారా పురుగుమందులు పిచికారీ చేసిన ముందుచూపున్న దార్శనికుడు అచ్యుతరామయ్య అన్నారు. పీడిత ప్రజలను విముక్తులను చేయటం కమ్యూనిస్టులకు మాత్రమే సాధ్యమవుతుందని నమ్మిన ఆయన చల్లపల్లి జమిందారీ వ్యతిరేక పోరాటాల్లో పాల్గొన్నారని చెప్పారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, మోపిదేవి ఎంపీపీ రావి దుర్గావాణి, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు, విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు, ప్రజానాట్యమండలి కళాకారుడు ఆర్.పిచ్చయ్య, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి, రైతుసంఘం రాష్ట్ర నేత హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, వేమూరి రత్నగిరిరావు, దాసి సీతారామరాజు ప్రసంగించారు. మల్లుపెద్ది బోసు, లంకా నాగమల్లి, నక్కా శ్రీను, కొల్లూరి శ్రీధర్, రావి ప్రభుదాస్, కొర్రపాటి ముఖర్జీ, రామకృష్ణ, అచ్యుతరామయ్య కుటుంబ సభ్యులు కంఠంనేని వాసు, పాలడుగు రత్నబాబు, కంఠంనేని జ్యోత్స్నాదేవి తదితరులు పాల్గొన్నారు.





జిల్లా ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైసీపీ శ్రేణులు, అవనిగడ్డలో ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నకిలీ మద్యాన్ని అరికట్టాలి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నకిలీ మద్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ జిల్లా ఎక్సైజ్ కార్యాలయం వద్ద మాజీ మంత్రి పేర్ని నాని ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ శీలం భారతి, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, వైసీపీ నాయకులు గూడవల్లి నాగరాజు, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సిలార్‌దాదా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఎక్సైజ్ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు. **అవనిగడ్డ :** ప్రజల ప్రాణాలను హరిస్తున్న నకిలీ మద్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం అవనిగడ్డలో వైసీపీ శ్రేణులు నిరసన తెలిపాయి. నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్త సింహాద్రి రమేష్‌బాబు ఆదేశాల మేరకు పార్టీ శ్రేణులు అవనిగడ్డ ఎక్సైజ్ కార్యాలయం నిరసన తెలిపారు. రాష్ట్రంలోని కల్తీ మద్యం, నకిలీ మద్యం తయారీ, అమ్మకాలపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, ఎంపీటీసీ సభ్యు తోట గణేష్, మండల పార్టీ అధ్యక్షుడు రేపల్లె శ్రీనివాసరావు, గరికపాటి వెంకటేశ్వరరావు, గాజుల జయగోపాల్, చింతలపూడి బాలభాస్కరరావు, గార్లపాటి గోపి, బొర్రా రామకృష్ణ, షేక్ నజీర్ బాషా, యాసం శివ, తుంగల వేణు, గరికపాటి కృష్ణారావు, పెనుమూడి చంద్రశేఖర్, అన్నపరెడ్డి పరమాత్మ, కొండవీటి నాగరాజు, బుడిమి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్ మాఫియాను పెంచి పోషించింది జగనే : ఎమ్మెల్యే కాగిత

బంటుమిల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో లిక్కర్ మాఫియాను జగన్ పెంచి పోషించారని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నకిలీ మద్యం, లిక్కర్ మాఫియాను అరికట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కఠిన చర్యలు చేపట్టారన్నారు. రూ. 3500 కోట్ల మద్యం కుంభకోణంలో జైలు పాలైన వైసీపీ నాయకులు ఎలా మాట్లాడతారని అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్మోహనరెడ్డి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించి వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి పేర్ని నాని రౌడీలాగా పోలీస్ స్టేషన్‌లో అధికారిని బెదిరించడం ఎంత వరకు సబబు అన్నారు. కూటమి పాలనను చూసి వైసీపీ నాయకులకు భయం పట్టుకుందని, దీంతో అబద్దపు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. మాజీ మంత్రులు, వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే అన్ని విధాలా మంచిదని పెడన ఎమ్మెల్యే కాగిత హితవు పలికారు.

అక్రమంగా నిల్వ చేసిన బాణసంచా స్వాధీనం

కోడూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కోడూరు మూడో వార్డు అనధికారికంగా నిల్వ చేసిన మందుగుండు సామగ్రిని పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ చాణిక్య మాట్లాడుతూ, కోడూరు వెంకట పాండురంగారావు ఏ విధమైన అనుమతులు, లైసెన్స్ లేకుండా మందుగుండు సామాగ్రి నిల్వ చేయడంతో రూ.58.500 విలువైన బాణసంచా సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చాణిక్య తెలిపారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం

పెడన రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నందిగం వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యులుగా ఉన్న పామర్తి పెద్దశ్రీరామమూర్తి మరణించారు. కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం సొసైటీ ద్వారా పదివేల రూపాయలను సంఘం అధ్యక్షుడు యారగాని నాగరాజు అందించారు. రైతుల సమస్యల పరిష్కారంలో వ్యవసాయ పరపతి సంఘాలు ముందుంటాయని నాగరాజు అన్నారు.

శాంతమ్మకు వెంకట్రామ్ నివాళి

నాగాయలంక, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంకలో ప్రవాసాంధ్రుడు బొడ్డు నాగరాజు మాతృమూర్తి శాంతమ్మ(70) సోమవారం మృతి చెందారు.ఆమె భౌతికకాయాన్ని ఎమ్మెల్యే బుద్దప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్, ఉపసర్పంచ్ తలశిల వెంకట నరసింహారావు, మత్స్యకార నేత కర్రి కృష్ణమూర్తి తదితరులు ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అవనిగడ్డలో మెగా జాబ్‌మేళా రేపు

అవనిగడ్డ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డలోని ఎస్‌వీఎల్ కళాశాలలో ఈనెల 15వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎస్‌వి.ఎల్ కళాశాలలో జరిగే జాబ్‌మేళాలో హెటిరో ల్యాబ్, జయలూకాస్, కోల్గేట్ పామోలివ్, ముథూట్ ఫైనాన్స్ తదితర సంస్థలు పాల్గొంటాయన్నారు.

మహిళలకు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ వద్ద కేన్సర్ నిర్ధారణ శిబిరాన్ని కలెక్టర్ బాలాజీ సోమవారం ప్రారంభించారు. అల్ట్రాసౌండ్, మెమోగ్రామ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. జేసీ ఎం. నవీన్, డీఆర్వో చంద్రశేఖర్, ఏవో రాధిక, డా. బి.పద్మావతి, డా. ఇంద్రజ, రేడియాలజిస్టు అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

శమీపత్రాలతో శంకరునికి పూజ

నాగాయలంక, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామికి శమీ పత్రాలతో భక్తులు విశేష పూజలు చేశారు.



వీధుల్లో నిలిచిన వర్షపు నీరు

నాగాయలంకలో భారీ వర్షం

నాగాయలంక, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంకలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉరుములు మెరుపులతో చిన్నగా మొదలైన వర్షం కాసేపటికి భారీ వర్షంగా మారింది. ప్రధాన రహదారులన్నీ వర్షపు నీటితో నిండిపోయింది. వాహనదారులు, పాదచారులు, తీవ్ర అసౌకర్యం కలిగింది. సాయంత్రం వరకు తెరతెరలుగా వర్షం కురవటంతో జనజీవనానికి ఆటంకం కలిగింది.

జీఎస్టీ సంస్కరణలతో మహిళలకు మేలు



జీఎస్టీ కరపత్రాలు అందజేస్తున్న కొరెడ్ల సుశీల

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ సంస్కరణల వల్ల ధరలు తగ్గి మహిళలు ఎంతో ఆనందంతో ఉన్నారని టీడీపీ నాయకురాలు కొరెడ్ల సుశీల అన్నారు. సోమవారం చిలకలపూడి తదితర ప్రాంతాల్లో జీఎస్టీ సంస్కరణలపై ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు.



సీజనల్ వ్యాధులు-జాగ్రత్తలపై అవగాహన

గూడూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : వర్షా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముక్కొల్లు గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం మల్లవోలు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. పాటు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎం ఎం. కోమలి, ఆశ వర్కర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.



అర్బన్ బ్యాంక్ చైర్మన్ దిలీప్‌ను సత్కరిస్తున్న టీడీపీ నేతలు

అర్బన్ బ్యాంక్ చైర్మన్ దిలీప్‌కు సత్కారం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితాల్లో అవకతవకలపై పోరాడిన దిలీప్ సేవలను గుర్తించి మచిలీపట్నం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ అధ్యక్ష పదవిని అధిష్ఠానం కట్టబెట్టిందని టీడీపీ నాయకులు అన్నారు. మచిలీపట్నం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ దిలీప్, బ్యాంక్ డైరెక్టర్ వేము కోటేశ్వరరావులను టీడీపీ నాయకులు పి.వి.ఫణికుమార్, బందారు నాని, ఊదండి రాంబాబు సోమవారం ఘనంగా సత్కరించారు. దిలీప్ మాట్లాడుతూ, వైసీపీ పాలనలో మాజీ మంత్రి పేర్నినాని దాచుకో దోచుకో అన్న రీతిలో పాలన చేశారన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక కొల్లు రవీంద్రను పేర్ని నాని విమర్శిస్తున్నారన్నారు. కార్పొరేషన్‌లో బడ్జెట్ సమావేశం కూడా ఏర్పాటు చేయకుండా పేర్నినాని అడ్డు తగిలారన్నారు. ఈ సమావేశంలో కట్టా రామ్ చరణ్, జె వెంకట్, వేమూరి నాగసాయిశర్మ, మోటుపల్లి దుర్గా శరత్, నూకల శేషుబాబు, మత్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పడవలో ప్రయాణం చేస్తున్న ఎడ్లంక వాసులు

పాత ఎడ్లంక వాసులకు తప్పని పడవ ప్రయాణం

అవనిగడ్డ రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది గర్భంలో ఉన్న పాత ఎడ్లంక వాసులకు పడవ ప్రయాణమే దిక్కుగా మారింది. దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఇల్లా రవి ఆధ్వర్యంలో పాత ఎడ్లంకలో కాజ్‌వే పనులకు శ్రీకారం చుట్టి దానిని పూర్తి చేశారు. తరచూ వరదలు వస్తుండటంతో కాజ్‌వే పూర్తిగా దెబ్బతింది. పాత ఎడ్లంక వాసులు అవనిగడ్డకు చేరుకోవాలంటే పడవ ప్రయాణం తప్పడం లేదు. పాలకులు వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చినా అది నెరవేరడం లేదు. పాలకులు ఎప్పటికి కరుణించి తమ గ్రామానికి వంతెన నిర్మిస్తారోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.



కాపు సంక్షేమ భవనం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకం

కాపు సంక్షేమ భవన నిర్మాణం పూర్తి చేయండి

కోడూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన కాపు సంక్షేమ భవన నిర్మాణం వెంటనే చేపట్టాలని మండల కాపు సంఘం నాయకులు కోరుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ రూ.50 లక్షల నిధులు మంజూరు చేసి కాపు సంక్షేమ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధులను నిలుపుదల చేయటంతో భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం ముళ్ల పొదలతో నిండిపోయింది. ఎమ్మెల్యే బుద్దప్రసాద్ కాపు సంక్షేమ భవన నిర్మాణ ఆవశ్యకతను గుర్తించి, నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కౌలురైతు సంఘం నాయకులు

కౌలురైతులకు అన్నదాత సుఖీభవ వర్తింపచేయాలి

మోపిదేవి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింపచేయాల్సిందిగా తహసీల్దార్ ఎం.హరనాథ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు భూ యజమానితో సంబంధం లేకుండా కౌలురైతు కార్డు అందించి ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రాయితీలు కౌలు రైతులకు వర్తించేలా చూడాలన్నారు. మండల కౌలు రైతు సంఘం కార్యదర్శి ఎం.సురేష్‌బాబు, బెజవాడ నాగేశ్వరరావు, రామారావు తదితరులు ఉన్నారు.



జీవన ఎరువుల తయారీపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

జీవన ఎరువులతో నాణ్యమైన దిగుబడులు

ఘంటసాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం జీవన ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు ఎం.వెంకటలక్ష్మీ, కె.రేవతి జీవన ఎరువులు వినియోగించే విధానాన్ని, ప్రదర్శన ద్వారా రైతులకు వివరించారు. జీవన ఎరువులను వివిధ పంటల్లో వాడటం వల్ల ఖర్చు తగ్గటంతోపాటు నాణ్యమైన దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ ఎరువులు వరి, మినుముతోపాటు కూరగాయ మొక్కలకు కూడా వినియోగించుకోవచ్చునని సూచించారు. శాస్త్రవేత్త కృష్ణవేణి పాల్గొన్నారు.

మామిడి ప్రసాద్‌కు చిన్నా అభినందన



పెడన, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పెడనకు చెందిన ఆర్యవైశ్య ప్రముఖుడు మామిడి ప్రసాద్ ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (నామ్) జిల్లా అధ్యక్షుడుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ కొల్లూరి చిన్నా అభినందించి సత్కరించారు. ఆత్మకూరి సురేష్, దేసు శ్రీనివాస్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



పెనుమల్లి హైస్కూల్‌లో చేరిన ఉపాధ్యాయులతో హెచ్‌ఎం నాగేశ్వరరావు

కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరిక



పెడన, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పెడన మండలంలో సోమవారం 14 మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లు ఎంఈవో ఎస్.సలోమి తెలిపారు. పెడన మండలం చెన్నూరు జడ్పీ హైస్కూల్‌లో ఆరుగురు, పెనుమల్లి జడ్పీ హైస్కూల్‌లో నలుగురు, నందమూరు జడ్పీ హైస్కూల్‌లో నలుగురు విధుల్లో చేరినట్లు వివరించారు. నూతన ఉపాధ్యాయులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె.ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు, ఏ. నాగేశ్వరరావు, ఎం.వి. రాజేంద్రప్రసాద్ జాయినింగ్ పత్రాలు అందజేసినట్లు ఎంఈవో-2 వై.వి. హరనాథ్ తెలిపారు. **మోపిదేవి :** మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన 14 మంది ఉపాధ్యాయులు మండలంలో విధుల్లో చేరినట్లు ఎంఈవోలు జి.ఎన్.బి. గోపాల్, ఏ.వి.రమణ తెలిపారు. ఎంఈవో కార్యాలయంలో స్కూల్ అసిస్టెంట్లు ఎనిమిది మంది, ఎస్జీటీలు ఆరుగురు రిపోర్టు చేసి విధుల్లో చేరారన్నారు. మోపిదేవి జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో ఇద్దరు, కె.కొత్తపాలెం జడ్పీహెచ్ఎస్‌లో ముగ్గురు, పెదకళ్లేపల్లి జడ్పీ హెచ్ఎస్‌లో నలుగురు, కొక్కిలిగడ్డ జడ్పీ హెచ్ఎస్‌లో ఇద్దరు, అన్నవరం ఎంపీయూపీ పాఠశాలలో ఒకరు, నాగాయితిప్ప, ప్రజా శక్తినగర్‌లో ఒక్కొక్కరు చొప్పున విధుల్లో చేరినట్లు తెలిపారు. కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులను సహచర ఉపాధ్యాయులు అభినందించారు. **నాగాయలంక :** మెగా డీఎస్సీలో విజేతలుగా నిలిచిన 23 మంది కొత్త ఉపాధ్యాయులు సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో విధుల్లో చేరారు. వారికి పాఠశాల విద్యాకుటుంబం స్వాగతం పలికింది. **ఘంటసాల :** డీఎస్సీ ద్వారా ఎంపికైన 13 మంది నూతన ఉపాధ్యాయులు మండలంలోని వివిధ పాఠశాలల్లో విధుల్లో చేరారు. గోగినేనిపాలెంలో ఇద్దరు, ఘంటసాల జడ్పీ హైస్కూల్‌లో నలుగురు, వేములపల్లి ఎంపీయూపీలో ఒకరు, శ్రీకాకుళం జడ్పీహైస్కూల్‌లో ముగ్గురు, మల్లాయిచిట్టూరు జడ్పీ హైస్కూల్‌లో ఒకరు, లంకపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఇద్దరు విధులకు హాజరయ్యారు. నూతనంగా ఉద్యోగాలు సాధించి విధులకు హాజరైన ఉపాధ్యాయులను సీనియర్లు అభినందించారు.